జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*




సంపుటి 16 సంచిక 61 విశాఖపట్నం సోమవారం 23 అక్టోబర్ 2023 8 పేజీలు వెల : 5.00




విజయదశమి సందర్భముగా
నేడు ప్రజాపాలన కార్యాలయం సెలవు
కావున మంగళవారం సంచిక వెలువడదు
పునఃదర్శనం బుధవారం
..ఎడిటర్

# అవాంతరాలు ఎదురైనా..
# గగన్‌యాన్ తొలి టెస్ట్ ఫ్లైట్ విజయవంతం

● షార్‌లో రెండు గంటలు ఉత్కంఠ చివరకు ఆలస్యంగా ప్రయోగం

**శ్రీహరికోట, అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తలపెట్టిన తొలి టెస్ట్ వెహికల్ (టీవీ–డీ1) ప్రయోగం కాస్త ఆలస్యమైనా విజయవంతమైంది. ఇందులోని క్రూ మాడ్యూల్ సురక్షితంగా బంగాళాఖాతాన్ని తాకింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ (షార్)లో శుక్రవారం రాత్రి 7.30 గంటలకు మొదలైన కౌంట్‌డౌన్ 12.30 గంటలు కొనసాగిన తర్వాత టీవీ–డీ1 నింగిలోకి బయలుదేరాలి. అలా జరగలేదు. శనివారం ఉదయం 8 గంటలకు చేయాల్సిన ప్రయోగం.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉదయం 8.30, 8.45 గంటలకు వాయిదాపడింది. ఇంజిన్ ఇగ్నిషన్ సక్రమంగా జరగనందున లిఫ్ట్–ఆఫ్‌కు ఐదు సెకన్ల ముందు హోల్డ్‌లో పెట్టారు. కారణాన్ని గుర్తించి సాంకేతిక లోపాలు సరిదిద్దాక ఉదయం 10 గంటలకు సింగిల్ స్టేజ్ లిక్విడ్ రాకెట్ నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఉత్కంఠగా ఎదురుచూశారు. మొదటిసారిగా లిక్విడ్ ఇంజిన్‌తో ఈ ప్రయోగం చేపట్టారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి రాకెట్ బయలుదేరిన ఒకటిన్నర నిమిషాల తర్వాత ఇస్రో (మిగతా...2లో)



## యూపీలో 'మిషన్ మహిళా సారథి'.. 51 బస్సు సర్వీసులకు డ్రైవర్లు/కండక్టర్లు మహిళలే



**లఖ్‌నవూఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో 'మిషన్ మహిళా సారథి' ప్రారంభమైంది. ఆ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన మొత్తం 51 బస్సు సర్వీసులను సీఎం యోగి ఆదిత్యనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. వీటికి డ్రైవర్లు, కండక్టర్లు అంతా మహిళలే కావడం గమనార్హం. రామ్‌కథా (మిగతా...2లో)

## భారత వ్యవహారాల్లో జోక్యం వల్లే.. కెనడా సిబ్బంది తగ్గింపుపై జైశంకర్



**దిల్లీఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** భారత్– కెనడా సంబంధాలు క్లిష్ట దశలో ఉన్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. భారత వ్యవహారాల్లో కెనడా దౌత్య సిబ్బంది జోక్యంపై ఆందోళన నెలకొందన్నారు. అందుకే.. వారి సంఖ్య విషయంలో సమానత్వాన్ని అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. కెనడాలోని భారత దౌత్యవేత్తల భద్రత విషయంలో పురోగతి కనిపిస్తే.. కెనడియన్లకు వీసాల జారీని పునః ప్రారంభించే (మిగతా...2లో)

## నేను జైలులో లేను.. ప్రజల హృదయాల్లో ఉన్నా: చంద్రబాబు బహిరంగ లేఖ



**రాజమహేంద్రవరంఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** తెలుగు ప్రజలకు తెదేపా అధినేత చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. తాను జైలులో లేనని, ప్రజల హృదయాల్లో ఉన్నానని పేర్కొన్నారు. ములాఖత్‌లో భాగంగా తనను కలిసిన కుటుంబసభ్యులకు తెలుగు ప్రజలనుద్దేశించి రాసిన లేఖను చంద్రబాబు అందజేశారు. " నేను జైలులో లేను.. మీ అందరి గుండెల్లో ఉన్నా. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజాచైతన్యంలో ఉన్నా. విధ్వంస పాలనను అంతం చేయాలనే మీ సంకల్పంలో ఉన్నా. ప్రజలే నా కుటుంబం. జైలు గోడల మధ్య కూర్చొని ఆలోచిస్తూ ఉంటే 45 ఏళ్ల నా ప్రజా జీవితం కళ్ల ముందు కదలాడుతోంది. నా రాజకీయ ప్రస్థానమంతా తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగింది. దీనికి ఆ దేవుడితో పాటు మీరే సాక్ష్యం. ఓటమి భయంతో నన్ను జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు దూరం చేశామనుకుంటున్నారు. నేను మీ మధ్య తిరుగుతూ ఉండకపోవచ్చు. కానీ, అభివృద్ధి రూపంలో ప్రతి చోటా కనిపిస్తూనే ఉంటా. కుట్రలతో నాపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారు. కానీ, నేను నమ్మిన విలువలు, విశ్వసనీయతని ఎన్నడూ చెరిపేయలేరు. ఈ చీకట్లు తాత్కాలికమే. సత్యం అనే సూర్యుడి ముందు కారు మబ్బులు వీడిపోతాయి. సంకెళ్లు నా సంకల్పాన్ని బంధించలేవు. జైలు గోడలు నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవు. జైలు ఊచలు నన్ను ప్రజల్నుంచి దూరం చేయలేవు. నేను తప్పు చేయను.. చేయనివ్వను. ప్రజల నుంచి నన్ను ఒక్క క్షణం కూడా ఎవరూ దూరం చేయలేరు. 45 ఏళ్లుగా నేను కాపాడుకుంటూ వస్తున్న విలువలు, విశ్వసనీయతను చెరిపేయలేరు. ఆలస్యమైనా న్యాయం గెలుస్తుంది.. నేను త్వరలో బయటకొస్తా. ప్రజల కోసం, రాష్ట్ర ప్రగతి కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తా. ఈ దసరాకి పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తానని రాజమహేంద్రవరం మహానాడులో ప్రకటించాను. (మిగతా...2లో)

## 2024 ఎన్నికల్లో 'పీడీఏ'దే హవా : అఖిలేశ్



**అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** కాంగ్రెస్– సమాజ్‌వాదీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వివాదం నడుస్తోన్న వేళ.. ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. దీంతో జాతీయ స్థాయిలో విపక్ష కూటమిపై నీలినీడలు కమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్ష కూటమి 'ఇండియా'పై వరుసగా విమర్శలు గుప్పిస్తోన్న వేళ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'పీడీఏ' దే హవా అంటూ సోషల్ మీడియాలో పేర్కొనడం చర్చనీయాంశమయ్యింది. 'మిషన్ 2024. నేతాజీ (ములాయం సింగ్ యాదవ్) అమరుడు. వచ్చే ఎన్నికల్లో పీడీఏ విజయం సాధిస్తుంది. అఖిలేశ్ యాదవ్ పేదలకు న్యాయం చేస్తాడు' అని ఓ యువకుడు శరీరంపై రాసుకున్నాడు. ఇలా ఒంటిపై సమాజ్‌వాదీ (మిగతా...2లో)

## బంగాళాఖాతంలో వాయుగుండం! తుపానుగా బలపడే అవకాశం?



**విశాఖపట్నంఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** మధ్య బంగాళాఖాతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ ఆదివారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుంది. అనంతరం ఈ వాయుగుండం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు పయనించనుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో మరింతగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం నివేదికలో వెల్లడించింది. వాయుగుండంగా మారిన (మిగతా...2లో)









## మొదటి పేజీ తరువాయిలు

### యూపీలో 'మిషన్ మహిళా సారథి'.. 51 బస్సు సర్వీసులకు డ్రైవర్లు/కండక్టర్లు మహిళలే

పార్క్ వద్ద ప్రారంభోత్సవం పూర్తయిన అనంతరం సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. మహిళలు అన్ని ఉద్యోగాలు చేయలేరనే అభిప్రాయం తప్పని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిరూపించిందన్నారు. మహిళలు డ్రైవర్లు, కండక్టర్లుగా రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పోలీసు, ఇతర శాఖల్లో కలిపి 1.5లక్షల మంది స్త్రీలకు ఉద్యోగాలు కల్పించామని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ఆ నియామకాలకు కొనసాగింపుగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్త్రీలను డ్రైవర్లుగా, కండక్టర్లుగా నియమించిందని చెప్పారు. మహిళలను గౌరవిస్తూ.. వారి స్వావలంబనకు కృషి చేస్తే సమాజం అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం యోగి అయోధ్యలోని ఛోటీ దేవ్‌కాళీ ఆలయంలో పూజలు చేశారు. మహంత్ నృత్య గోపాల్ దాస్‌తో మాట్లాడి ఆయన యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు.

### భారత వ్యవహారాల్లో జోక్యం వల్లే.. కెనడా సిబ్బంది తగ్గింపుపై జైశంకర్

అవకాశం ఉందన్నారు. ఓ కార్యక్రమంలో భాగంగా భారత్- కెనడా సంబంధాలపై జైశంకర్ ఈమేరకు మాట్లాడారు. 'వియన్నా ఒప్పంద సూత్రాల్లో దౌత్యపర సమానత్వం గురించి స్పష్టంగా ఉంది. భారత వ్యవహారాల్లో కెనడా సిబ్బంది నిరంతర జోక్యంపై మాకు ఆందోళనలు ఉన్నాయి. అందుకే మేం ఈమేరకు చర్యలు తీసుకున్నాం' అని భారత్‌లో కెనడా దౌత్య సిబ్బంది తగ్గింపుపై జైశంకర్ స్పందించారు. భారత్, కెనడాల మధ్య సంబంధాలు ప్రస్తుతం క్లిష్ట దశలో ఉన్నాయన్నారు. కెనడా రాజకీయాల్లోని కొన్ని వర్గాలు, వారి విధానాలతో భారత్‌కు సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన దరిమిలా.. రెండు దేశాల మధ్య దౌత్యపర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను ఖండించిన భారత్.. కెనడాలో వీసా సేవలను నిలిపేయడంతోపాటు భారత్‌లోని దౌత్యసిబ్బంది సంఖ్యను తగ్గించుకోవాలని ఒటావాకు డెడ్‌లైన్ విధించింది. ఈ క్రమంలోనే 41 మందిని కెనడా వెనక్కి రప్పించింది. దిల్లీ నిర్ణయం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ట్రూడో సర్కారు ఆరోపించగా.. నిబంధనలకు అనుగుణంగానే చర్యలు తీసుకున్నామని భారత్ స్పష్టం చేసింది.

### బంగాళాఖాతంలో వాయుగుండం! తుపానుగా బలపడే అవకాశం?

తర్వాత దిశ గమనం బట్టి ఏపీపై కురిసే వర్షాలపై అంచనా. ఈ నెల 24, 25 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు విస్తాయని, మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఈ వాయుగుండం తుపానుగా బలపడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి సూచికగా తమిళనాడులో శనివారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయని ఐఎండీ తెలిపింది. నేడో, రేపో మన రాష్ట్రంలోనూ ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

### నేను జైలులో లేను.. ప్రజల హృదయాల్లో ఉన్నా: చంద్రబాబు బహిరంగ లేఖ

అదే రాజమహేంద్రవరం జైలులో నన్ను ఖైదు చేశారు. త్వరలో బయటకొచ్చి పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తా. నా ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్ కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తా. ఎప్పుడూ బయటకు రాని నా భార్య భువనేశ్వరిని.. నేను అందుబాటులో లేని ఈ కష్టకాలంలో ప్రజల్లోకి వెళ్లి వారి తరపు పోరాడాలని నేను కోరాను. ఆమె అంగీకరించింది. నా అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, అరాచక పాలనను ఎండగట్టడానికి 'నిజం గెలవాలి' అంటూ మీ ముందుకు వస్తోంది. జనమే నా బలం, జనమే నా ధైర్యం. దేశవిదేశాల్లో నా కోసం రోడ్డెక్కిన ప్రజలు వివిధ రూపాల్లో మద్దతు తెలుపుతున్నారు. నా క్షేమం కోసం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మీరు చేసిన ప్రార్థనలు ఫలిస్తాయి. న్యాయం ఆలస్యం అవ్వొచ్చునేమోకానీ, అంతిమంగా గెలిచేది మాత్రం న్యాయమే. మీ అభిమానం, ఆశీస్సులతో త్వరలోనే బయటకు వస్తా. అంత వరకు నియంత పాలనపై శాంతియుత పోరాటం కొనసాగించండి. చెడు గెలిచినా నిలవదు, మంచి తాత్కాలికంగా ఓడినట్టు కనిపించినా కాలపరీక్షలో గెలిచి తీరుతుంది. త్వరలోనే చెడుపై మంచి విజయం సాధిస్తుంది. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు. మీ నారా చంద్రబాబు నాయుడు" అని లేఖలో పేర్కొన్నారు.

### 2024 ఎన్నికల్లో 'పీడీఏ'దే హవా : అఖిలేశ్

పార్టీ రంగులు (ఎరుపు, ఆకుపచ్చ) పులుముకున్న యువకుడి ఫొటోను షేర్ చేసిన అఖిలేశ్ యాదవ్.. '2024లో ఎన్నికలు ఉన్నాయి. పీడీఏదే హవా' అంటూ వ్యాఖ్యానించారు. పీడీఏ అంటే.. పిచ్‌డే (వెనుకబడిన వర్గాలు), దళితులు, అల్పసంఖ్యాక వర్గాలు అని అర్థం. రాష్ట్ర స్థాయిలో పొత్తులు పని చేయవని ముందే చెబితే 'ఇండియా' కూటమికి దూరంగా ఉండేవారమని ఇటీవల ఆయన పేర్కొన్న విషయం తెలిసింది. ముఖ్యంగా మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి కాంగ్రెస్ ఒక్కసీటు కూడా ఇవ్వకపోవడం తాజా వివాదానికి కారణమయ్యింది. దీంతో కాంగ్రెస్ 18 చోట్ల అభ్యర్థులను దించింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అఖిలేశ్ యాదవ్.. ఇండియా కూటమిపై విమర్శలు గుప్పిస్తున్నారు.

### మరాఠా యోధుడు అస్త్రసన్యాసం?

**ముంబై, అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో తాను ఏ నియోజక వర్గం నుంచి పోటీ చేయనని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశర చేయడానికి పార్టీ కార్యకర్తలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పోటీ చేయాలంటూ పార్టీ వర్గాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నా యని, అయితే తాను 2009 ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గిన సోలాపూర్ జిల్లా మధ నియోజకవర్గమే కాదు దేని నుంచి కూడా బరిలోకి దిగనని తెలిపారు.

## అవాంతరాలు ఎదురైనా.. గగన్‌యాన్ తొలి టెస్ట్ ఫ్లైట్ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రవేత్తలు అబార్ట్ స్థితిని ప్రదర్శించారు. దాంతో రాకెట్ పైభాగంలోని క్రూ ఎస్కేప్ వ్యవస్థను సంబంధించిన ఇంధన మోటర్లు ప్రజ్వరిల్లాయి. 12 కిలోమీటర్ల ఎత్తులో క్రూ ఎస్కేప్ వ్యవస్థ రాకెట్ నుంచి వేరైంది. వాహనం 17 కి.మీ. ఎత్తులో ఉండగా క్రూ ఎస్కేప్ మాడ్యూల్, క్రూమాడ్యూల్ విడిపోయాయి. తర్వాత పారాచూట్లు విచ్చుకోగా సెకనుకు 8.5 మీటర్ల వేగంతో క్రూ మాడ్యూల్ సురక్షితంగా బంగాళాఖాతాన్ని తాకింది. తీరానికి పది కిలోమీటర్ల దూరంలో భారతీయ నౌకాదళం దాన్ని స్వాధీనం చేసుకుంది. టీవీ-డీ1 పరీక్ష విజయవంతమైన తర్వాత ఇస్రో అధిపతి డా.సోమనాథ్.. శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు తెలిపారు. వాతావరణ సమస్యల కారణంగా ప్రయోగాన్ని రీషెడ్యూల్ చేశామన్నారు. లిఫ్ట్ ఆఫ్ ప్రక్రియను పూర్తిచేసిన తర్వాత, గ్రౌండ్ కంప్యూటర్ నుంచి నాన్-కన్ఫర్మెంటను గుర్తించి లిఫ్ట్ ఆఫ్‌ను నిలిపివేశామని వెల్లడించారు. దాన్ని వెంటనే సరిచేసి వాహనాన్ని సిద్ధం చేశామన్నారు. బంగాళాఖాతంలో టచ్‌డౌన్ తర్వాత క్రూమాడ్యూల్‌ను సాగర జలాల నుంచి వెలికితీయడానికి భారత నౌకాదళ బృందం నాయకత్వం వహించిందని చెప్పారు. టీవీ-డీ1 విజయవంతంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ గగన్‌యాన్ సాకారం దిశగా ఈ ప్రయోగం మనల్ని మరింత చేరువ చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇస్రో లాంచ్ చేసిన గగన్‌యాన్ క్రూ మాడ్యూల్‌ను శనివారం భారత నౌకాదళం విజయవంతంగా సాగర జలాల నుంచి స్వాధీనం చేసుకుంది. ఈ విషయాన్ని తూర్పు నౌకాదళ వర్గాలు తెలిపాయి. నిర్దిష్ట ప్రమాణాల విధానాన్ని పాటిస్తూ ఇస్రో, నౌకాదళ బృందాలతో సమన్వయ ధోరణి అవలంబించి సంయుక్త సమాచార వ్యవస్థల ద్వారా క్రూ మాడ్యూల్‌ను సకాలంలో సాగర జలాల నుంచి నేవీ డైవర్స్ నౌక డెక్‌పైకి తీసుకొచ్చినట్లు తెలిపాయి.

## ఆకట్టుకుంటున్న 'సామాజిక సాధికారిత యాత్ర' గ్లింప్స్



**అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు అధిక ప్రాధాన్యత నేపథ్యంలో ఈ నెల 26 నుంచి వైఎస్సార్ సీపీ బస్సు యాత్ర చేపట్టనుంది. సామాజిక న్యాయం పేరిట ఈ యాత్ర చేపట్టనుంది వైఎస్సార్‌సీపీ. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాష్ట్ర ప్రభుత్వ ఏవిధమైన ప్రాధాన్యత ఇస్తోందనేది ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. బీసీ, ఎస్టీ, ఎస్టీ మైనారిటీలకు చెందిన మొత్తం 17 మంత్రులు ఈ బస్సు యాత్రలో పాల్గొంటారు. అయితే వైఎస్సార్‌సీపీ యూఎస్ఏ విభాగం 'సామాజిక సాధికారిత యాత్ర' ట్రైలర్ రిలీజ్ చేసింది. దీనికి సంబంధించి గ్లింప్స్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

# చంద్రబాబుకు మంత్రి అంబటి రాంబాబు బహిరంగ లేఖ

**అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** స్కిల్ స్కామ్ కేసులో ఇరుక్కుని ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు నాయుడు.. ప్రజలకు ఓ బహిరంగ లేఖ అంటూ 'సానుభూతి డ్రామా'కు తెరలేపారు. తాను జైలులో లేనని, ప్రజల హృదయాల్లో ఉన్నానంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేశారు చంద్రబాబు. దీనిపై మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. చంద్రబాబు లేఖలోని కొన్ని అంశాలను లేవనెత్తుతూ సూటిగా ప్రశ్నించారు మంత్రి అంబటి రాంబాబు. అంబటి రాంబాబు లేఖ ద్వారా బాబుకు సంధించిన ప్రశ్నలివే..



**చంద్రబాబు నాయుడు గారికి...**

45 రోజుల జైలు జీవితం తర్వాత కూడా, నాలుగైదు నిజాలు చెబుతారేమో అన్న ఆశను నిరాశగా మారుస్తూ మీరు ఉత్తరం రాశారు. జైలు నుంచి ఈ ఉత్తరాన్ని ఎలా బయటకు పంపారన్న టెక్నికల్ డీటెయిల్స్‌లోకి, 17(ఏ) ప్రొటోకాల్స్‌లోకి నేను వెళ్లటం లేదు. మీ పేరిట టీడీపీయే ఆ ఉత్తరం ఇచ్చింది కాబట్టి.. ఆ ఉత్తరం చదివిన తరవాత నేను మీకు బహిరంగ లేఖ రాస్తున్నాను. ఇందులో కొన్ని ప్రశ్నలకు లేవనెత్తుతున్నాను.

1. మొదటి వాక్యమే మీరు జైలులో లేనని రాశారు. కాబట్టి దయచేసి మీ న్యాయ పోరాటం మొత్తాన్ని ఆపేయండి. క్వాష్ పిటిషన్లు, బెయిల్ పిటిషన్లు ఉపసంహరించుకోండి.

2. ప్రజల గుండెల్లో ఉన్నారని రాశారు. అదే నిజమైతే.. మీ పేరు చెబితే గుర్తుకు వచ్చే నాలుగు స్కీంలు దయచేసి ప్రజలకు తెలియజేయండి.

3. మీ కోసం ప్రజా చైతన్యం ఉవ్వెత్తి ఎగిసిపడుతోందని అన్నారు. ఎగిసిపడుతున్న ఆ ప్రజలు ఎవరో దయచేసి తెలియజేయండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద వర్గాలను కూడా ప్రజలే అని గుర్తించండి. వారిలో ఏ ఒక్కరూ మీరు చేసిన ద్రోహాన్ని మర్చిపోలేదు.

4. మీ రాజకీయ జీవితం అంతా తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సాగిందన్నారు. తెలుగు ప్రజలు అంటే... మీ ఉద్దేశంలో ఎవరు? హైదరాబాద్ మెట్రోలో నల్ల చొక్కాలు వేసుకున్న ఆ నలుగురునా? అమెరికాలో, బ్రిటన్‌లో, మీ దోపిడీ సొమ్ములతో స్థిరపడిన మీ బంధుగణాలా? ఎన్టీఆర్‌ను మీరు వెన్నుపోటు పొడవటంలో సహకరించిన మీ మీడియా మిత్రులా? బీజేపీలో ఉన్న మీ బంధువులా? కాంగ్రెస్‌లోకి పంపించిన మీ మనుషులా? కొద్దిమంది వామపక్షాల నాయకుల్లో ప్రవహిస్తున్న మీ పసుపు రక్తమా? ఎవరు తెలుగు ప్రజలంటే అన్నది దయచేసి తెలియజేయండి.

5. ఓటమి భయంతో మిమ్మల్ని జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు దూరం చేయాలని ఎవరో అనుకుంటున్నారని రాశారు. ఒక అవినీతిపరుడ్ని కేంద్ర ఐటీ శాఖ పట్టుకుని షోకాజ్ నోటీసు ఇచ్చింది. అది మీరే. స్కిల్ స్కాంలో నలుగురిని ఈడీ అరెస్టు చేసింది. ఆ స్కీంలో కర్త, కర్మ, క్రియ మీరే. స్కిల్ స్కాంలో మీకు కోర్టు రిమాండ్ విధించింది. ఆ రిమాండ్‌ను హైకోర్టు, సుప్రీంకోర్టు సమర్థించాయి. మరి, ప్రజల నుంచి మిమ్మల్ని ఎవరో దూరం చేయటం ఏమిటి? 45 ఏళ్లు దొరక్కుండా తప్పించుకున్నానన్న మీ ఆత్మవిశ్వాసం, 45 ఏళ్ల మీ వ్యవస్థల మేనేజ్‌మెంట్ ఈసారి మీకు సాధ్యం కాలేదు. కాబట్టి.. దొరికిపోయిన దొంగ దేశభక్తుడ్ని అని, ప్రజాసేవకుడ్ని అని భారీ డైలాగులు చెప్పటం బాగోదు.

6. ఇక, మీ సంకెళ్లు మీ సంకల్పాన్ని బంధించలేవని జైలు గోడలు, మీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయలేవని రాశారు. మీ మీద మీకు అంత సీను ఉంటే.. మీకు అంత ధైర్యం ఉంటే.. మీ మీద అంత నమ్మకం ఉంటే.. మీ ఆదాయం ఎంత? మీ ఆస్తులు ఎంత? అన్న అంశం మీద నేను ఒక పిటిషన్ వేస్తాను. కోర్టుల్లో స్టే కోసం వెళ్లకుండా సీబీఐ విచారణకు సిద్ధపడతారా?

7. స్కిల్ స్కాంలో వేరే వ్యక్తి ఎవరో సీబీఐ విచారణ జరగాలని పిటిషన్ వేస్తే మీ గుడ్డలు ఎందుకు తడుస్తున్నాయి.? రాష్ట్ర ప్రభుత్వ విచారణ కక్ష సాధింపు అని మీరు అంటున్నారు. అదే నిజమైతే.. కేంద్ర ప్రభుత్వ సీబీఐ విచారణకు మీరు ఆహ్వానించాలి కదా.? మరి, రెండింటికీ గుడ్డలు తడుస్తున్నాయంటే మీరు లేఖలో రాసిన డైలాగులు అన్నీ ఆత్మవంచనతో కూడిన అబద్ధాలే కదా.?

8. ఇక, దసరాకి పూర్తి మేనిఫెస్టో విడుదల చేయలేకపోయానని మరో భారీ డైలాగు వదిలారు. 2014 మేనిఫెస్టోలో మీరు చేసిన 650 వాగ్దానాలకు, అధికారంలోకి వచ్చాక మీరు చేసిన మొదటి సంతకాలకు ఏనాడూ దిక్కూమొక్కూ లేదు. కాబట్టే.. మిమ్మల్ని ప్రజలు... మీరు కొనుగోలు చేసిన ఎమ్మెల్యేల సంఖ్యకు మీ పార్టీని పరిమితం చేశారు. ఇప్పుడు మీరు మరో మేనిఫెస్టో విడుదల చేస్తే ఎంత? చేయకపోతే ఎంత?

9. ఈ రాష్ట్రంలో ఉండని మీరు, మీ పుత్రుడు, మీ దత్తపుత్రుడు మా రాష్ట్రంలో కేవలం గెస్టులు మాత్రమే కదా. ఇది మీకు వీకెండ్ రిసార్ట్ మాత్రమే కదా.?

10. ఎప్పుడూ బయటకు రాని మీ భార్యను మీరు ప్రజల్లోకి పంపుతున్నారని అన్నారు. ఎందుకండీ.. ఆవిడను ప్రజల్లోకి పంపటం.? ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినప్పుడే, కన్నతండ్రి పక్షాన గాక.. మీ పక్షాన ఉన్న ఆమె – ఇప్పుడు ఎన్టీఆర్ వారసురాలు ఎలా అవుతుంది? ఆవిడ నిజం గెలవాలి అంటూ నినాదం చేస్తే.. మొదట ఎన్టీఆర్‌ను మీరే పొడిచారన్న నిజం చెప్పి ఆ తర్వాత ఏం మాట్లాడినా ఒకరో, ఇద్దరో నమ్ముతారు.

11. నా బలం జనమే అంటూ రాశారు. ఈ మధ్య జగన్ గారి స్పీచ్‌లు బాగా చూస్తున్నారని అర్థమైంది. జగన్ గారు పొత్తుల్ని నమ్ముకోవట్లేదండీ. తాను చేసిన ఇంటింటి అభివృద్ధిని, ఇంటింటికి పంపిన రూ.2.38 లక్షల కోట్ల డీబీటీని, ఇచ్చిన 31 లక్షల ఇళ్ల పట్టాలను, కడుతున్న 22 లక్షల ఇళ్లను, గ్రామ గ్రామంలోనూ తీసుకు వచ్చిన మార్పులను చూపించి మీరే నా బలం అని ప్రజలతో ఉన్నది ఉన్నట్టు చెబుతున్నారు. మరి, మీరు... ఆయన డైలాగ్ బాగుంది కదా అని నేనూ అంటానని అదే డైలాగ్ చెబితే బాగోదేమో అన్నది ఆలోచించుకోండి!

12. ఇక, చెడు గెలిచినా నిలవదన్నారు. మంచి తాత్కాలికంగా ఓడినా కాల పరీక్షలో గెలుస్తుందని అన్నారు. జగన్ గారి విషయంలో జరిగింది అదే కదా. ఆ చెడు చేసింది మీరే కదా?

మీ దుష్ట బృందంలో అందరికీ వయస్సు పెరిగిపోయింది. కానీ, జీవన సంధ్యా సమయంలో కూడా నిజాన్ని ఒప్పుకునే అంతరాత్మ మాత్రం ఏ ఒక్కరికీ లేదు. మీరు ఇలాంటి లేఖలు మరిన్ని రాయాలని కోరుకుంటూ....

## ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించండి: సీపీఐ రామకృష్ణ



**అమరావతిఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షల మంది ఉపాధ్యాయులకు దాదాపు రూ.800 కోట్లు జగన్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులకు 2022 జులై నుంచి ఇవ్వాల్సిన డీఏను 2024లో మూడు విడతల్లో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పటం దుర్మార్గం. తమ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. సీపీఎస్ రద్దు విషయంలో కూడా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్యాయం జరిగింది" అని రామకృష్ణ తన లేఖలో పేర్కొన్నారు.

## బస్సు యాత్రతో ప్రజలకు మరింత చేరువ: మంత్రి బొత్స



- -ప్రజలకు జరిగిన మేలును వివరించడమే బస్సు యాత్ర ఉద్దేశం
- -ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చాం
- -సామాజిక న్యాయం చేసినది సీఎం జగన్ మాత్రమే
- -జరిగిన అభివృద్ధిని 175 నియోజకవర్గాల ప్రజలకు వివరిస్తాం
- -సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఆలోచిస్తూ ముందుకెళుతున్నాం

**విశాఖపట్నంఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** ప్రజలకు జరిగిన మేలును వివరించడమే బస్సు యాత్ర ఉద్దేశమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సామాజిక సాధికార బస్సు యాత్రతో ప్రజలకు మరింత చేరువవుతామన్నారు. సామాజిక న్యాయం చేసిన నాయకుడు సీఎం జగన్ మాత్రమేనని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చాం. జరిగిన అభివృద్ధిని 175 నియోజకవర్గాల ప్రజలకు వివరిస్తామని మంత్రి పేర్కొన్నారు. "సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఆలోచిస్తూ ముందుకెళ్తున్నాం. మద్యం ధరలు పెంచేశాం అంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ బెల్టుషాపులు లేకుండా నియంత్రించాం. మేనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకెళ్లి ఓట్లు అడిగే దమ్ము టీడీపీకి ఉందా?. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ప్రభుత్వం మాది" అని మంత్రి స్పష్టం చేశారు. పవన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఏ అంశంపైనా సరిగా స్టడీ చేయకుండా విమర్శలు చేస్తున్నారు. పవన్ తెలుసుకుని మాట్లాడితే మంచిది. బైజూస్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా కంటెంట్ అందిస్తున్నాం. పేద విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవకూడదా?. మీ పిల్లలే ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలా?. మన విద్యార్థులందరూ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నదే మా లక్ష్యం. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ రావాలన్నదే మా డిమాండ్. సీఎం జగన? ఢిల్లీ వెళ్లినప్పుడల్లా రైల్వే జోన్ గురించి అడుగుతున్నారు" అని మంత్రి బొత్స వివరించారు. నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రారంభిస్తున్నామని, ఈ యాత్రలో ప్రతీ ఒక్కరికీ జరిగిన మేలును వివరిస్తామన్నారు. దళితులకు, గిరిజనులకు సీఎం జగన్ చేసిన మేలు గతంలో ఎవ్వరూ చేయలేదు. ఈ నెల 26న ఇచ్ఛాపురం నుంచి బస్సు యాత్ర మొదలవుతుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

## వైకాపా ఎంపీ పుట్టినరోజు వేడుకలు.. అధికారుల తీరుపై భక్తుల విస్మయం



**ద్వారకాతిరుమలఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయ పరిసరాల్లో వైకాపా నేతల హడావిడితో భక్తులు విస్మయానికి గురయ్యారు. ఎంపీ పుట్టిన రోజు వేడుకలు శేషాచలం కొండపై నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ జెండాలు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా ద్వారకా తిరుమల ఆలయానికి చేరుకున్నారు. అంతే కాకుండా దేవస్థానానికి చెందిన కల్యాణ మండపంలో ఎంపీ పుట్టినరోజుకు సంబంధించి ఆలయ అధికారులు భోజనాలు ఏర్పాటు చేశారు. వంటలు చేయడం, వడ్డించడం అంతా.. దేవస్థానం సిబ్బందితోనే చేయించారు. ఈ కార్యక్రమానికి వందల మంది కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీకి సంబంధించిన టీషర్టులు ధరించి భోజనాలకు హాజరవ్వడంతో పాటు, పార్టీ జెండాలతో ర్యాలీలు నిర్వహిస్తూ హడావుడి చేశారు. అడ్డు చెప్పాల్సిన దేవాదాయశాఖ అధికారులు వారికే వత్తాసు పలికారు. కల్యాణ మండపాలకు అద్దె చెల్లించకుండా.. ఉచితంగా ఎంపీ పుట్టిన రోజు వేడుకలకు ఎలా ఇస్తారు? పుట్టినరోజు కార్యక్రమానికి ఆలయ సిబ్బందిని ఎలా వాడుకుంటారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శేషాచలం కొండపై వైకాపా పార్టీ కార్యాలయాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ మీటింగ్‌లు, భోజనాల కార్యక్రమాలు పుణ్యక్షేత్రంలో చేయడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుతో ఆలయ ప్రతిష్ఠ మసకబారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దుర్గమ్మ మండపానికి అమెరికా రాయబారి.. 'ధునుచి' నృత్యం చేసిన గార్సెట్టి



**దిల్లీఅక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రులు ఘనంగా సాగుతున్నాయి. దిల్లీలోని చిత్తరంజన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపానికి భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి విచ్చేశారు. అక్కడి వారు బెంగాలీ సంప్రదాయాల ప్రకారం ఆయన్ను ఆహ్వానించారు. మండపంలో నిర్వహించిన అమ్మవారి పూజ లో గార్సెట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజలు దుర్గా దేవికి అంకితంగా 'ధునుచి' నృత్యాన్ని చేస్తుంటారు. గార్సెట్టి కూడా నిప్పుల కుండను నోటితో పట్టుకొని ఆ నృత్యం చేశారు. అనంతరం వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. వారితో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. ఈ వేడుకలో భాగంగా ఆయన రకరకాల బెంగాలీ వంటకాలను రుచి చూశారు. కోల్‌కతాలో ప్రసిద్ధి చెందిన ఝల్ మురిని ఆస్వాదించారు. దీంతో పాటు బిర్యానీ, చేపలు, మరికొన్ని స్వీట్లను ఎంజాయ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేసిన ఆయన తన అనుభవాలను కూడా పంచుకున్నారు. "దిల్లీలోని సీఆర్ పార్క్‌లో నిర్వహించిన అద్భుతమైన సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొన్నా. ఎన్నో వంటకాలను రుచి చూశాను. భారత్‌లోని విభిన్న వేడుకలను ఎంజాయ్ చేస్తున్నాను. భారత్ సాంస్కృతిక వైవిధ్యం అద్భుతమైంది" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దాదాపు 1.3 లక్షల మంది దీనిని వీక్షించారు. నెటిజన్లు ఎరిక్ గార్సెట్టిపై ప్రశంసలు కురిపించారు. "ధునుచి నాచ్ నృత్యాన్ని చక్కగా చేశారు. ఎంతో అందంగా ఉంది" అని ఒకరు, "ఒక దౌత్యవేత్త భారత్‌లో ఈ విధంగా పర్యటించి దేశీయ పండుగలను చేసుకోవడం, సంస్కృతిని పాటించడం చరిత్రలో ఎప్పుడు జరగలేదు. నేను మీకు వీరాభిమానిగా మారాను సర్. మీరు ఎంతో మంచి వ్యక్తి" అంటూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. పశ్చిమ బంగ, కోల్‌కతాలో నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. వారు 'ధునుచి' నృత్యంతో అమ్మను ప్రసన్నం చేసుకోవడం అక్కడి ఆచారం. నవరాత్రుల్లోని దుర్గాష్టమి రోజు నుంచి ఈ నృత్య ప్రదర్శనలు మొదలవుతాయి. అమ్మవారి నిమజ్జనం దాకా కొనసాగుతాయి. ఇందులో భాగంగా అడుగున వెడల్పుగా ఉన్న మట్టి కుండలో నిప్పులు వేసి.. సాల్ చెట్ల నుంచి వచ్చే జిగురును దానిపై చల్లుతారు.. అత్యవసర నూనెలు కలగలిసిన ఈ జిగురు నిప్పులపై పడగానే పరిమళం వెదజల్లుతుంది. ఈ తరహా కుండల్ని రెండు చేతుల్లో పట్టుకొని లేదంటే నోటితో అదిమి పట్టి.. డోలు వాయిద్యానికి లయబద్ధంగా నృత్యం చేస్తారు. ఈ క్రమంలో నిప్పు పైన పడకుండా కుండల్ని బ్యాలన్స్ చేస్తూ నృత్యం చేయడం విశేషం.

## సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

– రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



**విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి అంతిమ విజయం సాధిస్తాయని మహిషాసురుడిపై దుర్గామాత విజయం ప్రపంచానికి చాటిందన్నారు. స్త్రీ శక్తి ఏమిటో లోకానికి తెలిసివచ్చిందన్నారు. దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రంలో సర్వమత సమానత్వం, సౌభ్రాతృత్వం వర్ధిల్లుతున్నాయని మల్లాది విష్ణు అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో దేశంలోనే అత్యంత వేగంగా పురోగతి సాధిస్తుందని తెలిపారు. కనకదుర్గమ్మ అనుగ్రహంతో నియోజకవర్గంలో ప్రభుత్వ పాలన, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అద్భుతంగా అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఆ ఆదిపరాశక్తి అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సకల సిరి సంపదలు కలగాలని రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుండాలని కోరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అమేయశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జగన్మాత చల్లని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

## రాత్రి పూట తిరిగే వాటికి భీమిలి పోలీసులు కౌన్సిలింగ్



**భీమిలి ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 22:** విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం భీమిలి క్రైమ్ పోలీస్ స్టేషన్లో రాత్రిపూట తిరిగే స్ట్రేంజర్స్ ని మరియు పని పాటు లేకుండా ఖాళీగా ఉంటూ బీచ్ చూద్దామని రాత్రి రెండు గంటల సమయంలో ఊరకనే తిరుగుతున్న వ్యక్తులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి మరియు నేరాలు ఏ రకంగా జరుగుతున్నాయి రాత్రిపూట తిరగడం వలన మీకు కలిగిన నష్టాలు, దొంగలు తప్పించుకోవడానికి కలిగే అవకాశాలు, వంటి విషయాల గురించి చెప్పి . బైకు దొంగతనాలు జరగకుండా మీరు వేయవలసిన లాక్స్ ఏ రకంగా ఉండాలి అనే దాని గురించి కూడా వివరించి . సీసీ కెమెరాలు ఉండటం వలన కలిగే ప్రయోజనాలు ఒంటి విషయాలు వివరించడం జరిగింది అని భీమిలి పోలిష్ స్టేషన్ సిభంది వెల్లడించారు

## శరవణ రెసిడెన్సిలో మూడో వార్షికోత్సవ బతుకమ్మ సంబరాలు





**కారంపూడి అక్టోబర్22 .ప్రజాపాలన ప్రతినిధి. :** పట్టణంలోని నరసరావుపేట రోడ్ లోని శరవణ రెసిడెన్సి అపార్ట్మెంట్లో మూడో వార్షికోత్సవ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు అపార్ట్మెంట్ అధ్యక్షులు కజ్జం ప్రసాద్ రావు ఆధ్వర్యంలో 8 రోజులపాటు మహిళా భక్తుల ఘనంగా పాటలు పాడుతూ ఆటలాడుతూ కోలాటం చేస్తూ సంబరాల్లో జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన వారికి ఆర్థిక సహాయం అందించిన ఒపీచర్ల టిడిపి నాయకులు



**కారంపూడి అక్టోబర్22 .ప్రజాపాలన . ప్రతినిధి :** మండలం లో నీ ఒప్పిచర్ల గ్రామంలో బత్తుల శ్రీను భార్య దుర్గ పార్థివ దేహాన్ని సందర్శించి పరామర్శించిన ఒప్పిచర్ల టిడిపి నాయకులు కుటుంబ ఖర్చులకు ఆర్థిక సహాయంగా తెలుగుదేశం పార్టీ జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం గా 5000 ఐదు వేల రూపాయలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బత్తిన ఆనంద్ కుటుంబానికి 30000 సహాయం చేసిన టిడిపి నాయకులు





**కారంపూడి. అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :.** పట్టణంలో నీ ఇందిరాగాంధీ బొమ్మ కాలనీకి చెందిన దాసరి కులం సంచార జాతుల కులానికి చెందిన బత్తిన ఆనంద్(35) చిన్న పాటి కుర్చీల వ్యాపారం చేస్తూ(కూలీ పనులు చేస్తూ) బొమ్మలు అమ్ముతూ జీవనం సాగిస్తారు వారి భార్య రామాంజమ్మ కు శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 11 గంటల సమయంలో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ సదుపాయాలు లేక వైద్యులు సిపారసు చేయడంతో కుటుంబ సభ్యులు రామాంజమ్మ ను నరసరావుపేటకు తీసుకెళ్లారు. భార్యను అంబులెన్స్ లో పంపి ప్రసవానికి డబ్బులు తీసుకొచ్చేందుకు ఆనంద్ ఇంటికి తిరిగి వచ్చారు. డబ్బులు తీసుకొని ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో జూలకల్లు వద్ద గుంతల రోడ్డులో వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు తీవ్ర గాయాలైన ఆనందును 108 అంబులెన్స్ లో నరసరావుపేట లోని ప్రాథమిక వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఇతనికి ముగ్గురు ఆడపిల్లలు ఒక మగ బిడ్డ ఉన్నారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన రామాంజమ్మకు వైద్యుల సూచనతో భర్త మరణించిన విషయం బంధువులు చెప్పలేదు. వారు మాట్లాడుతూ పిడుగురాళ్ల మండలం జూలకల్లు నుంచి గుత్తికొండ వరకు సుమారు పది కిలోమీటర్లు మేర రోడ్డు గుంతల మయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్న పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదని వీళ్ళ నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది అని టిడిపి సీనియర్ నాయకులు పంగులూరు అంజయ్య అన్నారు. పల్నాడు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని సొంత నియోజకవర్గంలో ఈ ఘటన జరగడం చాలా దురదృష్టకరం అని ఆంధ్రప్రదేశ్లోని ప్రాథమిక వైద్యశాలలో సరైన సదుపాయాలు లేక సెల్ఫోన్ లైట్లు వేసి ఆపరేషన్లు, కాన్పులు చేయడం ఈ ప్రభుత్వంలో చూస్తున్నాం అని ఈ ఘటన జగన్ రెడ్డి దారుణ పాలనకు నిదర్శనం పేద సంచార జాతి కులానికి చెందిన బత్తిని ఆనంద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని నలుగురు చిన్నపిల్లలు కు ప్రభుత్వం తక్షణమే 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని మాచర్ల పట్టణ తెలుగు యువత బాబు ఖాన్ డిమాండ్ చేశారు. మాచర్ల తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బ్రహ్మారెడ్డి అతని కుటుంబానికి 30000 ఆర్థిక సహాయం చేసి భవిష్యతతులోనూ కుటుంబానికి అండగా ఉంటాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కటికల బాలకృష్ణ, బోల్నేడి శ్రీను, దాసరి సంగ రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల అప్పారావు తెలుగు యువత తుపాకుల రత్తయ్య చప్పిడి శివ, గోరంట్ల నాగేశ్వరావు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజుపాలెం మండల విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గేదెలు మృతి



**రాజుపాలెం అక్టోబర్22 ప్రజాపాలన ప్రతినిధి :** రాజుపాలెం మండల పరిధిలో బలిజేపల్లి గణపవరం గ్రామాల మధ్య గల సైదమ్మ సప్తా వద్ద బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ ప్రసాద్ కు సంబంధించి విద్యుత్ షాక్ తగిలి ఐదు గేదలు చనిపోవడం జరిగింది. ఈ సందర్భంగా బలిజేపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో కూడా అదే ప్రదేశంలో గేదలు చనిపోవడం జరిగిందని అక్కడ విద్యుత్తుకు సంబంధించిన తీగలు మొత్తం కూడా కిందకు రావడంతోటి విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయడం జరిగిందని కానీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంతో ఈ సంఘటన జరిగిందని గ్రామస్తులు వాపోయారు. అసలు మండల పరిధిలో అన్ని గ్రామాల్లో కూడా విద్యుత్ శాఖ అధికారులు సమస్యలపై పట్టించుకున్న పాపాన పోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి కొండ మోదు లో మరోసారి రాజుపాలెంలో విద్యుత్ శాఖ కు సంబంధించిన కార్యాలయాలను ముట్టడించారు. కానీ ఫలితం మాత్రం శూన్యం అని ఈప్పటికైనా ప్రజా ప్రతినిధులు కానీ జిల్లా ఉన్నత విద్యుత్ శాఖ అధికారులు గాని పట్టించుకోనీ మండల పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు పనిచేసే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అలానే చనిపోయిన గేదలకు సంబంధించి సుమారు 2.50 లక్షల వరకు నష్టం జరిగిందని ప్రజలు తెలిపారు.

## బీచ్ క్లీనప్ చేసిన క్రియేట్ ఏ స్మైల్ ఫౌండేషన్




**భీమిలి ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 22:** విశాల జిల్లా తూర్పు నియోకవర్గంలో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భావితరాలకు మంచి బాట వేద్దాం అని ఒక సంకల్పంతో ఈరోజు విశాఖపట్నం తేనేటి పార్క్ వద్ద క్రియేటి ఏ స్మైలీ ఫౌండేషన్ వారు బీచ్ క్లీనప్ కార్యక్రమం నిర్వహించారు దీనిలో భాగంగా ఫౌండర్ నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ బీచ్ లో ఎన్నో జీవరాశులు జీవిస్తున్నాయి అటువంటి వాటిని కపాడుకునే భాద్యత ఎంతైనా మనకు ఉంది అని ప్లాస్టిక్ వల్ల కొన్ని జీవరాశులు అంతరించి పోతున్నాయి ప్లాస్టిక్ భూగర్భంలో కరిగిపోనిది నీటిలో మునిగిపోనిది అందువల్ల ప్లాస్టిక్ నిర్మూలనకై ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అదేవిధంగా ఈ కార్యక్రమంలో నేషనల్ క్రెడిట్ కాప్స్ స్టూడెంట్స్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు అని పేర్కొన్నారు

## గుడివాడ శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహెూత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొడాలి నాని, కైలే అనిల్, ఎంపీ నందిగం సురేష్

నూతనంగా నిర్మించిన దేవస్థాన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ సురేష్

జగన్మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన నేతలు



**గుడివాడ ప్రజాపాలన ప్రతినిది :** గుడివాడ శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహెూత్సవ వేడుకల్లో ఎమ్మెల్యేలు కొడాలి నాని, కైలే అనిల్ కుమార్, పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్, కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు. తొలుత స్వామి వారిని ,అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దేవస్థాన కార్యాలయాన్ని ఎమ్మెల్యేలు కొడాలి నాని, అనిల్ కుమార్ తో కలిసి ఎంపీ సురేష్ ప్రారంభించి, దేవస్థాన ప్రాంగణంలో జరుగుతున్న మహా చండి హెూమ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నాని, అనిల్ కుమార్ , ఎంపీ సురేష్ , జడ్పీ చైర్మన్ హారికలకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, దేవస్థాన ఇఓ షణ్ముగ నటరాజన్, అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరి రాంబాబు దేవస్థాన సాంప్రదాయం ప్రకారం సత్కరించి, అమ్మవారి ప్రసాదం, జ్ఞాపికలను అందజేశారు. ఎంతో వైభవంగా జరుగుతున్న దుర్గాష్టమి పర్వదిన వేడుకల్లో అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరమని ఎంపీ సురేష్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వానికి జగన్మాత ఆశీస్సులు ఉండాలని, అమ్మవారి కృపతో యావత్ ప్రజానీకం సుభిక్షంగా జీవించాలని ఎమ్మెల్యే కొడాలి నాని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్, పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను,మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైసీపీ నేతలు ఉప్పాల రాము, పాలడుగు రాంప్రసాద్, దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు..

# సీఎం జగన్ విశాఖ షిఫ్టింగ్‌కు ముహూర్తం ఫిక్స్.! ఇంతకీ ఎప్పుడంటే.?



**భీమిలి ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 22:** సీఎం క్యాంప్ ఆఫీసును విశాఖకు తరలించే విషయంలో పూర్తి క్లారిటీతో ఉన్నారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి. ముహూర్తాలు మారితే మారొచ్చు.. నిర్ణయంలో మాత్రం మార్పు లేదు అనేది ప్రభుత్వ వాదన. ఛలో విశాఖ తాజా ముహూర్తం డిసెంబర్ 17. ఆ దిశగా ఏర్పాట్లు కూడా శరవేగంగా జరిగిపోతున్నాయి. తాడేపల్లి టు విశాఖపట్నం.. అక్టోబర్ కాకపోతే డిసెంబర్.. క్యాంపాఫీసు కేరాఫ్ మార్చడం వంద శాతం ఖరారైంది. ఇటీవల ఇన్ఫోసిస్ క్యాంపస్ ప్రారంభ కార్యక్రమంలో కూడా సీఎం జగన్ ఈ మేరకు మరింత స్పష్టత కూడా ఇచ్చేశారు. ఆ మేరకు డిసెంబర్ చివరి వారంలో విశాఖలో మకాం పెట్టడానికి సిద్ధమయ్యారు. ఈసారి ముహూర్తం స్వామి స్వరూపానందేంద్ర స్వామి చేతుల మీదుగా జరిగింది. అందుకే.. ఈ నిర్ణయంలో మార్పు లేదు అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. ఎప్పుడు నిర్మాణాలు పూర్తయితే అప్పుడు విశాఖకు రావాలని సీఎం జగన్ సమాయత్తంగా ఉన్నారు. ఆరేడు నెలలుగా యంత్రాంగాన్ని కూడా అలర్ట్ చేస్తూ వస్తున్నారు.

### దసరాకు పక్కా అనుకున్నా..!

మొదట్లో అక్టోబర్ 24.. విజయదశమికి పక్కా అనుకున్నారు. భవన నిర్మాణ పనుల్ని టూరిజం, పట్టణాభివృద్ధి శాఖలు నేరుగా పర్యవేక్షిస్తున్నా.. ఇప్పటివరకు 20 పర్సెంట్ పనులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దసరాకి కనీసం గృహప్రవేశం చేసి లాంచనాలు ముగించాలని కూడా ప్రతిపాదన ఉంది. కానీ ఒక్కసారి గృహప్రవేశం చేశాక.. అక్కడే బస ఉండకుండా గ్యాప్ ఇస్తే జనంలోకి రాంగ్ సిగ్నల్ వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే దసరా ముహూర్తాన్ని డ్రాప్ చేశారు

### స్వరూపానంద సలహా మేరకే..

విజయదశమి కాకపోతే డిసెంబర్ 17 నాడు ముహూర్తం బాగుందని స్వరూపానందేంద్ర స్వామి సూచించారట. ఆలోగా నిర్మాణ పనులు పూర్తి చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ప్రభుత్వానికి సంబంధించి ముఖ్యమైన, కీలక కార్యక్రమాలకు ముహూర్తాల కోసం ఆయన్నే ఆశ్రయించి, ఆయన సలహాల మేరకే ముందుకెళ్లడం జగన్ అలవాటు అని జనం చెప్పుకుంటారు. ఇటీవల విజయవాడలో జరిగిన యాగంలో పూర్ణాతి కోసం స్వామివారినే పిలిపించారు. ప్రభుత్వంలో కీలక అధికారి ఒకరు స్వయంగా వెళ్లి స్వరూపానందేంద్రను కలిసి క్యాంపాఫీసు మార్పిడికి ముహూర్తం కోసం సంప్రదించినట్టు సమాచారముంది. ఆ ప్రకారమే.. డిసెంబర్ 17 ఖరారైనట్టు తెలుస్తోంది. విశాఖ రుషికొండపై నిర్మించిన భవనాల్లో డిసెంబర్ 17న గృహప్రవేశం జరిగాక.. వెంటనే తిరిగి వెళ్లకుండా వారం రోజుల పాటు అక్కడే బస ఉండేలా ఏర్పాటు జరిగింది. తర్వాత పల్లె నిద్రలు, రాష్ట్ర పర్యటనలు విశాఖ కేంద్రంగానే జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల వరకు తాడేపల్లిని వెకేట్ చెయ్యకుండా.. అవసరాన్ని బట్టి రెండు క్యాంపాఫీసుల్ని వాడేలా సీఎం జగన్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## క్రోమా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ప్రచారం ప్రారంభం

**గుంటూరు,ప్రజాపాలన, ప్రతినిధి :** టాటా ఎంటర్‌ప్రైజ్ అయిన క్రోమా, తమ వార్షిక భారీ 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' ప్రచారంతో తిరిగి వచ్చింది. క్రోమా స్టోర్లు, క్రోమా వెబ్‌సైట్ క్రోమా డాట్ కామ్ అంతటా గృహెూపకరణాలు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు, మరిన్ని విభాగాలలో డీల్‌లు, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆఫర్‌లు ఈనెల 25 వరకు అందుబాటులో ఉంటాయి. అదనంగా, క్రోమా నుండి కొనుగోలు చేసే కస్టమర్‌లు స్టోర్‌లలో లక్కీ డ్రా ద్వారా కిక్ ఈవీ ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లను గెలుచుకునే అవకాశం ఉంది.

## ఇబ్బంది పడుతున్న రైతులకు సాగునీరు అందించండయ్యా.

– జిల్లా కలెక్టర్ కు విన్నవించిన వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి



**చీరాల, అక్టోబర్ 22, ప్రజాపాలన :** చీరాల మండలంలో మూడువేల ఎకరాలలో పంట వేసి, సక్రమంగా సాగునీరు అందక ఇబ్బంది పడు తున్న రైతులకు, సాగునీరు అందించి ఆదుకోండయ్యా...., అంటూ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్ స్పందన హాలు నందు జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో, చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి మాట్లాడుతూ, మండలంలో మూడు వేల ఎకరాలు వరి సాగు చేస్తున్నారని, పంటలకు సరిగా సాగు నీరు అందక, రైతులు ఇబ్బంది పడుతున్నారని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన కలెక్టర్, అక్కడే ఉన్న సాగునీటి అధికారులతో మాట్లాడి, పంటలకు ఇబ్బందులులేకుండా నీరు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

## దేవీ నవరాత్రులు 8వ రోజు





**గుడివాడ ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 22:** విజయదశమిని పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు 8వ రోజు ఆదివారం అమ్మవారు పలు దేవలయాలలో శ్రీకనకదుర్గాదేవి రూపాలలో దర్శనమించారు

**శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో...**

స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానముఃలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవాలల్లో భాగంగా అమ్మవారు శ్రీకనకదుర్గా అవతారంలో దర్శినమిచ్చారు. ప్రతేకంగా దేవలయంలో మహా చండీ హోమం నిర్వహించారు. దేవస్థానము అభివృద్ధి కమిటి చైర్మన్ చందరాల హరిరాంబాబు, కార్యనిర్వహాణాధికారి షణ్యగం నటరాజన్, కమిటీ సభ్యుల నేతృత్వంలో అమ్మవార్కి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

**శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానంలో...**

స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానములో శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానము అభివృద్ధి కమిటి చైర్మన్ పంచకర్ల వెంకట్, సభ్యులు, షణ్యగం నటరాజన్, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో...**

గుడివాడలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవలల్లో భాగంగా అమ్మవారు శ్రీ కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అభివృద్ధి కమిటి చైర్మన్ దుడ్డు చిన్నా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు),ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ సంఘటితం కండి.

## ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుమన్



**ఏలూరు ప్రజాపాలన ప్రతినిధి :** ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ సంఘటితమై జిల్లా స్థాయిలో బలోపేతం కావాలని ఏపీ కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కే సుమన్ పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవన్లో జిల్లా స్థాయి ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ జరిగింది. ఈ సభకు సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సభ ఉద్దేశించి సుమన్ మాట్లాడుతూ ఐకమత్యంతో ముందుకు సాగి ప్రభుత్వాన్ని మెప్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆ విధంగా జిల్లాలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ సంఘటితం కావాలన్నారు. చిరుద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ఏపీ జెఎసి అమరావతి ఎల్లప్పుడూ చొరవ చూపుతోందని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు చాలీచాలని వేతనాలు అయినప్పటికీ కుటుంబాలను భారంగానే నెట్టుకుని వస్తున్న తరుణంలో ప్రభుత్వ పథకాలను కూడా నిలిపివేయడం దారుణమని పథకాలన్నీ పునరుద్ధరించాలని సుమన్ ప్రభుత్వాన్ని కోరారు. ఏపీజేఏసీ అమరావతి ఏలూరు జిల్లా అధ్యక్షులు కె రమేష్ కుమార్ మాట్లాడుతూఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేని కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని అభద్రత భావంతో పనిచేస్తున్నారని తెలుపుతూ రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏపీ జెఎసి అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాంబాబు మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగి తమ యొక్క సమస్యల పరిష్కారంలో ఏపీజేఏసీ అమరావతి అండగా ఉంటుందని దానికి మేము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి మాట్లాడుతూ మహిళలు కూడా ఔట్సోర్సింగ్ ఉద్యమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో మేము అండగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు గురునాథ్, సుశీల, లక్ష్మీ కుమారి, హైమావతి, రంగ భాస్కర్, కిషోర్, సుబ్బారావు అనిల్ ఆదిరెడ్డి దుర్గ, నాగేశ్వరమ్మ, రాజేష్, నాగేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోన్ని వివిధ శాఖల అవుట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మామూళ్ల మత్తులో పోలీసులు : ఆగని అక్రమ గోవుల తరలింపు





**నూజివీడు, అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న పోలీసులు గో అక్రమ రవాణా, గో మాంసం తరలింపులను నిలువరించడం లేదంటూ మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, గో సంరక్షణ సమితి సభ్యులు కలగర శివ సాయి అన్నారు. నూజివీడులో వారు ఆదివారం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయంలో గో సంరక్షణకు ఓ ప్రాధాన్యత ఉన్నదన్నారు. ఇందుకోసం గొప్ప గొప్ప చట్టాలు ఉన్నప్పటికీ, కవర్లు అందుకుంటున్న పోలీసులు వీటిపై పెద్దగా దృష్టి సారించడం లేదని ఆరోపించారు. పండుగ రోజుల్లో ఇంతటి పాడు పని చేస్తుంటే, ఒరిస్సా నుండి అనేక చెక్పోస్టులు దాటుకొని అక్రమంగా గోమాంసాన్ని తరలిస్తున్నారంటే పోలీసు యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ గో తరలింపు, గో మాంసం సరఫరాలను నిలువరించకపోతే, ఆమె అడ్డుకొని పోలీస్ స్టేషన్ల ద్వారా గో సంరక్షణ శాలలకు ఆవులను తరలిస్తామని హెచ్చరించారు.

### 18 టన్నుల గో మాంసం స్వాధీనం

ఒరిస్సా నుండి మహారాష్ట్ర వరకు నిత్యం అక్రమంగా గోమాంసం తరలిస్తున్నారన్న సమాచారంతో గో సంరక్షణ సమితి సభ్యులు నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలోని బైపాస్ వద్ద పహారాకాశారు. భారీ కంటైనర్ లో 18 టన్నుల గో మాంసాన్ని తరలిస్తుండగా నిలిపివేసి పరిశీలించారు. వే బిల్లు లో మాత్రం లక్ష రూపాయల విలువైన సి ఫుడ్ అని పేర్కొన్నారు. అన్ని రకాల బిల్స్ పరిశీలించి కంటైనర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. పండుగ వేళల్లో ఇంతటి పడుపని ఏమిటని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, గో సంరక్షణ సమితి సభ్యులు కలగర శివ సాయి, వైసిపి నేతలు పాలడుగు విజయకుమార్, మేకల అనిల్ కుమార్, పిళ్ళా చరణ్, ఉదయగిరి కృపారావు, కె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# " హిమాలయ గురూజీ దివ్య ఆశీస్సులతో మహా చండీ యాగం"



**వినుకొండ,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** మండలం విఠం రాజు పల్లి గ్రామం వద్ద గల సాయి బృందావనం (చిన్న షిరిడి) శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి ప్రదాత పూజ్యశ్రీ హిమాలయ గురువు దివ్య ఆశీస్సులతో భారతదేశంలో మునుపెన్నడు జరగని విధంగా రెండవసారి అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఎనిమిదవ రోజు కు చేరుకున్నాయి దసరా నవరాత్రుల శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఉదయం 6 గంటల నుండి గురూజీ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి మొదటగా ఎనిమిదవ రోజు ప్రత్యేక అలంకారం శ్రీ దుర్గ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలకు పాండ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరితా రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ మహా చండీ యాగం మరియు అభిషేకాలలో భారీ సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని గురూజీ సమక్షంలో పట్టణానికి చెందిన మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు మరియు శ్రీ దుర్గా దేవి అలంకారం సందర్భంగా శ్రీ దుర్గా దేవి అనుగ్రహ కటాక్షసిద్ధి పూజ శ్రీ హిమాలయ గురుదేవుల వారి స్వహస్తమలచే పూజా కార్యక్రమాలు కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది ప్రతిరోజు మధ్యాహ్నం 3,000 మంది భక్తులకు అన్నసంతర్పణ దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు సాయంత్రం సత్సంగం భజన కార్యక్రమాలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి గురువుగారి ఆశీస్సులు పొందారు గురూజీ మాట్లాడుతూ పది రోజులు పాటు జరిగే ఈ మహోత్సవములు సర్వలోక కళ్యాణార్థమై జరపబడుతున్నాయి రైతులు వ్యాపారులు కార్మికులు ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భూగర్భ జలాలు పెరిగి ప్రకృతి పచ్చదనముతో పరవశించాలని భక్తజన సమూహము ఈ మహోత్సవాలలో పాల్గొని ధన వస్తు సేవల రూపంలో మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని ఈ 9 రోజులపాటు హిమాలయ గురూజీ సహస్తములతో ఈ పది రోజులపాటు 18 హోమ గుండములతో మహా చండీయాగం జరుగును విశిష్ట పూజా కార్యక్రమాలు అమ్మవారికి విశేషమైన అలంకారాలు ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కలదని అమ్మవార్లు ఊరేగింపు మరి నిమర్జనం కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు పెండ్యాల. పుల్లారావు, డాక్టర్ ఆనంద్ కుమార్, పెండ్యాల. కాశి, మునిరెడ్డి ,పెండ్యాల. మోహన్ రావు, తాత. రమేష్, పెండ్యాల. సురేష్, కనుగండ్ల. కోటేశ్వరరావు, జెట్టి. శ్రీనివాసరావు, రామడుగు. కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఇట్లు శాంతి ఆశ్రమ ట్రస్ట్ వినుకొండ.

# కౌలురైతులందరికి రబీలో పంట రుణాలు అందించాలి

## - నవంబర్ 6న మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా పి.జమలయ్య



**మచిలీపట్నంఅక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** కౌలురైతులకు సులభంగా పంటరుణాలు ఇవ్వడానికి స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ను (ఎస్ ఒ పి) సవరించాలని, తద్వారా సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులైన కౌలురైతులందరికీ హామీలేని పంట రుణాలను అందజేసి ఆదుకోవాలని నవంబర్ మొదటి వారంలో అన్ని జిల్లాల్లో లీడ్ బ్యాంక్ మేనేజర్ల ఆఫీసుల వద్ద ధర్నాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం పిలుపునిస్తోంది. ఆదివారం మచిలీపట్నంలో డెల్ కంపెనీ జిల్లా కౌంటర్ రైతుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలురైతులసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంట సాగుదాల హక్కుల చట్టంలో పేర్కొన్న నిబంధన ప్రకారం కౌలుగుర్తింపు కార్డులు పొందిన కౌలురైతులకు ఏ ఇతర పత్రాలు అడక్కుండానే పంటరుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రూ. 1.30 లక్షల కోట్లు పంటరుణాలు ఇస్తే కౌలురైతులకు మాత్రం కేవలం రూ.518 కోట్లు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని, ఇది కూడా వాస్తవం కాదని ఇంకా తక్కువగానే రుణాలు ఇచ్చారని మాయమాటలు చెప్పి కౌలురైతులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తుందని అన్నారు. కౌలురైతులందరికి 100శాతం పంట రుణాలు ఇస్తామని చెబుతూనే మరో వైపు బ్యాంకులు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ని తయారు చేసి పంటలురుణాలు ఇవ్వకుండా ఆటంకం కల్పిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్లో 8 లక్షల మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇస్తే కేవలం రెండున్నర లక్షల మందికే పంటలు రుణాలు ఇచ్చి చేతులు దులుకుంటుందన్నారు. ఒకవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం రూ.1,60,000 వరకు ఎటువంటి షూరిటీ లేకుండానే కౌలురైతులకు రుణాలు పొందవచ్చు అని చెబుతోంది. మరోవైపు భూమి హామీ పెడితేనే పంట రుణాలు ఇస్తామని బ్యాంకులు చెప్పటం చాలా దారుణమన్నారు.

# స్వర్ణ రథంపై దేవదేవుడు శ్రీ వేంకటాదీశుడి విహారం



**తిరుమల, తిరుపతి,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఉదయం 7.15 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప బంగారుతేరులో పయనిస్తూ, భక్తుల్ని తన కృపాకటాక్షాలతో అనుగ్రహించాడు. మంగళవాయిద్యాల నడుమ తిరు మాడవీధులలో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి స్వర్ణరథన్ని లాగారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల- లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూబీ భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం. స్వర్ణ రథోత్సవంలో తిరుమల పెద్దజీయర్స్వామి, తిరుమల చిన్నజీయర్స్వామి, ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో సదా భార్గవి, సివిఎస్వో నరసింహ కిషోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్రెడ్డి, విజివో బాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 27న వైకాపా బిసి సామాజిక సాధికారత బస్సు యాత్ర

## -వైకాపా నేతల వెల్లడి



**తిరుపతి,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** తిరుపతిలో ఈనెల 27వ తేది సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైకాపా కు చెందిన వివిధ బిసి కులాల నాయకులు తొండమల్లు పుల్లయ్య,అక్కినపల్లి లక్ష్మయ్య,ఎంకె నాగరాజు,రామయ్య ఆచారి,బాబు యాదవ్,లవ్లీ వెంకటేష్,సాకం ప్రభాకర్,కేశవులు,దొరబాబు,ఉదయగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 27వ తేది మధ్యాహ్నం 2గంటలకు అన్నమయ్య సర్కిల్ నుంచి బస్సుయాత్ర మొదలవుతుందని లక్ష్మీనగర్ సర్కిల్,రామానుజ సర్కిల్,ఆర్టీసీ బస్టాండ్ మీదుగా గ్రూప్ థియేటర్స్ కూడలికి చేరుతుందన్నారు. అక్కడ బహిరంగ సభ జరుగుతుందని,బిసి మంత్రులు,రాయలసీమ కు చెందిన బిసి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొంటారన్నారు. బిసి,ఎస్సీ,ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు గతంలో ఏ ప్రభుత్వం చేయని మేళ్లను వైకాపా ప్రభుత్వం చేసిందని, రాజ్యాధికారంలో,కాంట్రాక్ట్ వర్కుల్లో,నామినేటెడ్ పదవుల్లో భాగస్వామలను చేసిందన్నారు. 56 బిసి కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని,బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. టిడిపి హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదరణ పేరుతో కులవృత్తిదారులకు కమిషన్లకు కక్కుర్తి పడి నాసిరం పనిముట్లు పంపిణీ చేసి మోసం చేసారన్నారు,బస్సు యాత్రలో జగనన్న ప్రభుత్వం బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలకు చేసిన మేళ్లను ప్రజలకు వివరించనున్నట్లు వారు తెలిపారు.

# రాష్ట్ర గవర్నర్కు సాదర వీడ్కోలు



**తిరుపతి,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం విమానంలో బెంగళూరుకు బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు అధికారులు సాదర వీడ్కోలు పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి,ఎస్పీ పరమేశ్వర రెడ్డి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు,,రేణిగుంట తహశీల్దార్ ఉదయ సంతోష్,డిఎస్పీ భవ్య గవర్నర్కు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. కాగా గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

# శివయ్య సేవలో మల్లాద్రి విష్ణు



**శ్రీకాళహస్తి, తిరుపతి,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి విజయవాడ ఎమ్మెల్యే ఎక్స్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాద్రి విష్ణు కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి విచ్చేశారు. వారిని ఆలయ అధికారుల స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పి.ఆర్.ఓ సూపర్డెంట్ విజయ సారధి, పి.ఆర్.ఓ నాగభూషణం నాయక్, టెంపుల్ ఏ.ఈఓ ధనపాల్ మరియు ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఆయుధ పూజ



**గుంతకల్లు అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి** దసరా పండుగ సందర్భంగా గుత్తి మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ వన్నూర్ బీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. కార్యాలయంలోని చెత్త తరలించే వాహనాలకు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద తాగునీరు సరఫరా చేసే మోటార్లకు ఆమె పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ రఘు, శానిటరీ ఇన్స్పెక్టర్ రంగయ్య ఇంజనీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు దసరా పండుగ శుభకాంక్షలు తెలిపారు.

# గ్రామీణ క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని ఇస్తున్నాయి - ఎమ్మెల్యే



**కదిరి అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** కదిరి మండలం కాలసముద్రం గ్రామంలో వైసిపి పార్టీ నాయకులు మలక ఇంద్ర ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎద్దుల బండ్ల పరుగు పందెం పోటీలను కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి తిలకించారు. అనంతరం పోటీల్లో విజయం సాధించిన రైతు సోదరులకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా ఎద్దుల బండ్ల పరుగు పందెం పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

# నవరాత్రుల సందర్భంగా ఉజ్జీనేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు



**రాప్తాడు అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలో నవరాత్రుల 8వ రోజు సందర్భంగా గ్రామంలో ఉన్న ఉజ్జీనేశ్వర స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకోవడానికి గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉజ్జీనేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడు స్పందన గ్రీవెన్స్ రద్దు

**తిరుపతి, తిరుపతి,అక్టోబర్ 22, ప్రజాపాలన ప్రతినిధి:** అక్టోబర్ 23న (నేడు) ప్రభుత్వ సెలవు దినం అయినందున జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే స్పందన గ్రీవెన్స్ ను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## సర్పంచి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



**ప్రత్తిపాడు , అక్టోబర్ 22, ప్రజాపాలన :** గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఆదివారం జొన్నలగడ్డ గ్రామం సర్పంచ్ మబ్బు శిరీషా కుటుంబాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పరామర్శించారు. సర్పంచ్ భర్త సుధాకర్ ఇటీవల అనారోగ్యం తో ఉన్నాడని తెలుసుకొని పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట జడ్పిటిసి సభ్యుడు బండారు శ్రీనివాసరావు, తుమ్మల సుబ్బారావు, రాధా గ్రామ వైసిపి నాయకులు ఉన్నారు.

## అక్రమ లేఅవుట్లలో రాళ్ల తొలగింపు



**టంగుటూరు, అక్టోబర్ 22, ప్రజాపాలన** ::అక్రమంగా లే అవుట్లు వేస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. వల్లూరు గ్రామ పరిధిలో శివపురం రోడ్డులో జమ్ములపాలెం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ నాయకుడు మక్కెన వెంకట్రావు, ఒంగోలుకు చెందిన రామకృష్ణ అనుమతి లేకుండా సర్వే నంబరు 540 – 2ఏ/1సీలో 1.27 సెంట్లు, 540 –2ఏలో 63 సెంట్లు మొత్తం 1.90 సెంట్ల మేర వ్యవసాయ భూమిలో ప్లాట్లుగా మార్చి రూ. 6 కోట్లకు విక్రయించేలా రాళ్ళు వేశారు. వప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి కోటి రూపాయలు పలుకుతుంది. దీంతో వల్లూరు పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్ పంచాయతీ సిబ్బందితో అక్రమ లేవుట రాళ్లను తొలగించి, నోటీసులు అందించారు. టంగుటూరులోని చెల్లెమ్మతోటలో సర్వే నంబర్లో 1243లో 70 సెంట్లలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయి. టీడీపీ నాయకుడు మక్కెన కోటేశ్వరరావు దగ్గర ఎలాంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాకుండానే పరిమి శ్రీను అనే వ్యక్తి.. ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్లు, ప్లాట్ల రాళ్లు ఏర్పాటు చేసి విక్రయాలకు సిద్ధం చేశారు. టంగుటూరు 4వ సచివాలయ కార్యదర్శి గోవిందు లేఅవుట్ల రాళ్లను తొలగించి, నోటీసులు జారీ చేశారు.

## లోక్అదాలత్‌లో 86 ప్రమాద కేసుల పరిష్కారం



**గుంటూరు,అక్టోబర్ 22, ప్రజాపాలన** :ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో శనివారం జరిగిన లోక్అదాలత్‌లో 86 ప్రమాద బీమా కేసులను పరిష్కరించి బాధితులకు రూ.6.11కోట్ల పరిహారం మంజూరు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం ప్రత్యేకంగా వాహన ప్రమాద కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్అదాలత్‌ను గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. గుంటూరు లీగల్, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో శనివారం జరిగిన లోక్అదాలత్‌లో 86 ప్రమాద బీమా కేసులను పరిష్కరించి బాధితులకు రూ.6.11కోట్ల పరిహారం మంజూరు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం ప్రత్యేకంగా వాహన ప్రమాద కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్అదాలత్‌ను గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ బీమా కంపెనీలకు చెందిన అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు. ఓ కేసులో బాధిత కుటుంబానికి రూ.1.20 కోట్ల పరిహారం మంజూరు చేశారు. బీమా కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం కావడంతో బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటో అదనపు జిల్లా కోర్టు జడ్జి సీహెచ్ రాజగోపాలరావు పర్యవేక్షించారు. ఆయన కూడా జడ్జి సీతారామకృష్ణారావుతో కలిసి బాధితులతోనూ, బీమా కంపెనీ అధికారులతో మాట్లాడి కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. అంతకుముందు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో జరిగిన న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి రాజగోపాలరావు ముఖ్య అతిథిగా పాల్గొని న్యాయపరమైన సలహాలు, పలు చట్టాల గురించి పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు.

## ఆలయాల అభివృద్ధికి రూ కోటి 40 లక్షలు మంజూరు



**కొత్తపేటఅక్టోబర్ 22, ప్రజాపాలన** :తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో పలు దేవాలయాల అభివృద్ధికి రూ. కోటి 40 లక్షల మంజూరయ్యాయి. మొత్తం 14 గ్రామ పంచాయతీల పరిధిలో గల ఆలయాలకు ఒక్కొక్క ఆలయానికి రూ. 10 లక్షలు చొప్పున ఈ నిధులు మంజూరయ్యాయి. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించడానికి దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు.

## అమృతలూరు లో చండీ హెూమం



**వేమూరు,అక్టోబర్ 22, ప్రజాపాలన** : మండల కేంద్రం అమృతలూరు లోని శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గాష్టమి సందర్భంగా ప్రవాస భారతీయులు పరుచూరి మీనాక్షి – సీతారామాంజనేయులు ఆర్థిక సహకారంతో చండీ హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఖడ్గమాల పూజ, సహస్రనామార్చన, చండీ హెూమం చేశారు. ఆలయ అర్చకులు నాగలింగం రామకృష్ణ, చావలి కుమార్ లు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## దసరా దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీక



**గురజాల, అక్టోబర్ 22, ప్రజాపాలన** :దసరా దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీకచెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ దసరా పండుగ అని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. అన్నారు. గురజాల నియోజకవర్గంలోని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ యరపతినేని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను అందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందంగా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

## యడ్లపాడు లో రెండు కార్లు ఢీ



**చిలకలూరిపేట, అక్టోబర్ 22, ప్రజాపాలన :** యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారిపై తిరుమల స్పిన్నింగ్ మిల్లు ఎదురుగా ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళ్తున్న రెండు కార్లు ఒకదానికొకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇసుక రీచ్‌లపై పోలీసుల దాడి



**బాపట్ల , అక్టోబర్ 22, ప్రజాపాలన** : ఇసుక రీచ్‌లపై సెబ్, రెవెన్యూ అధికారులు దాడిచేసిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. సెబ్ సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం మండలంలోని కుక్కలవానిపాలెం గ్రామంలో ఇసుక రీచ్‌లపై రెవెన్యూ, పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడిలో కుక్కలవానిపాలెం సమీపంలోని సర్వేనెంబర్ 317లో 1000 టన్నుల ఇసుకను సీజ్ చేసి అక్కల శ్రీనివాసరెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా సర్వేనెంబర్ 312లో 400 టన్నుల ఇసుకను సీజ్‌చేసి మంచాల రామిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సర్వేనెంబర్ 312/2ఎలో 400 టన్నుల ఇసుక సీజ్‌చేసి కావూరి గిరిరెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. సర్వేనెంబర్ 317లో 400 టన్నుల ఇసుకను సీజ్‌చేసి మరుప్రోలు గురవారెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు.

## కూరగాయలతో అమ్మవారికి అలంకరణ



**రౌతులపూడిలో పసుపు కొమ్ములు, అరటి ఆకులలో, పి. చామవారం లో కూరగాయలతో శాకాంబరి గా అమ్మవారిని అలంకరించారు.**

**రౌతులపూడి,అక్టోబర్ 22, ప్రజాపాలన** : రౌతుల పూడిలో పసుపు కొమ్ములు, అరటి ఆకులలో, పి. చామవారం లో కూరగాయలతో శాకాంబరి గా అమ్మవారిని అలంకరించారు. రౌతులపూడి, పి. చామవరం, ఎన్. ఎన్. పట్నం గ్రామాల్లో అమ్మవారు దుర్గాదేవి గా భక్తులకు దర్శనమిచ్చారు.

## ప్రియుడుతో కలిసి తల్లిని చంపిన బాలిక



**కంబాలచెరువు అక్టోబర్ 22, ప్రజాపాలన** : తన స్వేచ్ఛకు అడ్డు పడుతోందన్న అక్కసుతో ఓ బాలిక.. తన ప్రియుడు, అతడి స్నేహితులతో కలిసి పెంపుడు తల్లిని హతమార్చిన సంఘటన రాజమహేంద్రవరంలో కలకలం రేపింది. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసన్న వీరయ్యగౌడ్ శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. నగరంలోని కంబాలపేటకు చెందిన హతురాలు సిద్ధాబత్తుల మార్గరెట్ జులియానా (63) ఉపాధ్యాయురాలిగా పని చేసి, రిటైరయింది. భర్త నాగేశ్వరరావు ఎస్‌బీఐలో పని చేసేవాడు. ఏడాది క్రితం మృతి చెందాడు. ఆస్తులు బాగానే ఉన్నాయి. పిల్లలు లేకపోవడంతో 13 ఏళ్ల క్రితమే నెలల వయసున్న ఓ బాలికను దత్తత తీసుకున్నారు. భర్త మృతి చెందటంతో జులియానా పెంపుడు కుమార్తెతో కలసి ఉంటోంది. ఇటీవల ఆ బాలిక చెడు స్నేహాలు పట్టింది. కంబాలపేటకే చెందిన ఆకాష్ (19) అనే యువకుడితో ప్రేమలో పడింది. అతడితో ఫోన్‌లో మాట్లాడుతూండటంతో తల్లి మందలించేది. దీంతో ఆ బాలిక తల్లిపై కోపం పెంచుకుంది. ఆమె చనిపోతే ఆస్తులన్నీ తనకే చెందుతాయని భావించింది. ప్రియుడు ఆకాష్‌తో కలిసి సమయం కోసం ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ సాయంత్రం జులియానా బాత్‌రూములో కాలు జారి పడింది. కాలికి గాయమవడంతో బంధువులందరికీ తెలిపింది. విషయం తెలియడంతో జులియానాను చంపేందుకు ఇదే మంచి సమయమని ఆకాష్ భావించి, పథక రచన చేశాడు. స్నేహితులు అక్షయకుమార్ (అయ్యప్ప నగర్), దాస్యం దినేష్‌రాయ్(ఆర్యాపురం)తో కలిసి అతడు జులియానా ఇంటికి అదే రోజు అర్ధరాత్రి చేరుకున్నారు. ముందే సిద్ధం చేసుకున్న పథకం ప్రకారం.. ఆ బాలిక అప్పటికే సీసీ కెమెరాలను నిలిపివేసింది. అందరూ కలిసి, నిద్రపోతున్న జులియానా కాళ్లు, చేతులు పట్టుకుని వస్త్రంతో ముఖంపై అదిమి ఊపిరి ఆడకుండా చేసి, హతమార్చారు. అనంతరం ఆకాష్, అతడి స్నేహితులు ఏమీ ఎరగనట్టుగా బయటకు వెళ్లిపోయారు. తన తల్లి అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందిందని ఆ బాలిక బంధువులకు ఫోన్ చేసి, సాధారణ మృతిగా నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే, కుమార్తె ప్రవర్తన సరిగ్గా లేని విషయాన్ని జులియానా సీతానగరంలోని తన సోదరుడికి గతంలో పలుమార్లు చెప్పింది. ఈ నేపథ్యంలో అనుమానం రావడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయపాల్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. బాలిక పొంతన లేకుండా మాట్లాడటం, సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. లోతుగా విచారించగా ఆ బాలిక నేరాన్ని అంగీకరించింది. ఆమెతో పాటు మిగిలిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## నేడు ఎస్పీ కార్యాలయంలో స్పందన రద్దు

**నరసరావుపేట, అక్టోబర్ 22, ప్రజాపాలన** : పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం రేపు రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. విజయదశమి దసరా పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు. ఏమైనా అత్యవసర సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్ కు లేదా 100కు చేయాలని సూచించారు.



## నా మాటలను వక్రీకరించి అబద్ధాలు వండివార్చారు



**నరసరావుపేటఅక్టోబర్ 22, ప్రజాపాలన** : 'వైఎస్సార్ సీపీ వారు ఓట్లు వేయనీ యకుండా టీడీపీ వారు అడ్డుకోవాలంటే నన్ను దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని' తాను అంటే దానికి విపరీతార్థాలు జోడించి, వక్రీకరించి టీడీపీ అనుకూల దినపత్రికలో రాయటం దారుణమని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఆ దినపత్రికలో(సాక్షికాదు) తనపై వచ్చిన వార్తకు స్పందిస్తూ నరసరావుపేటలోని తన స్వగృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఆ పత్రికలో వచ్చిన వార్త దారుణమైందన్నారు. వడ్డెంగుంటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తాను వెళ్లానని, అక్కడ ఓ వ్యక్తి మీరెలా ఓట్లు వేసుకుంటారని ప్రశ్నించాడన్నారు. దీనిపై తాను మా పార్టీ వారు ఓట్లు వేయకుండా మీరు అడ్డగించాలనుకుంటే ఈ బ్రహ్మనాయుడును దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని తాను హెచ్చరించానన్నారు. అది సాధ్యంకాదని, ఎవరి ఓట్లు వారు వేసుకోవాలని సూచించానన్నారు. రుబాబు చేస్తానంటే కుదిరేపని కాదని చెప్పానన్నారు. తాను మాట్లాడిన మాటల్లో కొంతమేర కట్‌చేసి ఓట్లు మీరెలా వేస్తారో చూస్తానని తాను అన్నట్లుగా టీడీపీ అనుకూల పత్రికలో రాశారన్నారు. ప్రస్తుతం ఎవరు ఎవరిని బెదిరిస్తున్నారో, ఎవరు ఏవిధంగా మాట్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో లేని ఓట్లు ఉన్నట్లుగా టీడీపీ వారు రిగ్గింగ్ చేస్తున్నారన్నారు. రిగ్గింగ్, దొంగ ఓట్లు వేసే సంస్కృతి టీడీపీ వారిదని, దీనిని ఆపాలనేది తన అభిమతమన్నారు. వారు రిగ్గింగ్ చేస్తుంటే తాను చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. బెదిరించి ఓట్లు వేసేది టీడీపీ వారిదేనన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర లాంటి టీడీపీ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఈ నరేంద్ర, అతని కుటుంబ సభ్యులు రైతులు పెట్టుకున్న సంగం డెయిరీని పూర్తిగా లాగేసుకొని రూ.వందలకోట్లు దోపిడీ చేస్తున్నారన్నారు.

## ోదావరిలో గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు వెలికితీత



**తాళ్లరేవు,అక్టోబర్ 22, ప్రజాపాలన** : విద్యార్థుల విహారయాత్ర విషాదాన్ని మిగిల్చింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక వద్ద గౌతమీ గోదావరిలో స్నానానికి దిగిన నలుగురు యువకులు శనివారం గల్లంతయ్యారు. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది.. ఆదివారం ఉదయం నలుగురి మృతదేహాలను వెలికితీశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన యువకులుగా పోలీసులు గుర్తించారు. గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు ప.గో. జిల్లా తణుకు పట్టణంలోని సజ్జాపురం ప్రాంతానికి చెందిన ఏడుగురు మూడు ద్విచక్ర వాహనాలపై శనివారం గోపులంక పుష్కరఘాట్ వద్దకు చేరుకున్నారు. తన పుట్టినరోజున స్నేహితులతో కలిసి విహారానికి వచ్చిన హనుమకొండ కార్తిక్(21) గోదావరిలో స్నానానికి దిగాడు. అతను నీటిలో మునిగిపోతుండడాన్ని ఒడ్డునున్న మిగిలిన ఆరుగురిలో మద్దెన ఫణీంద్ర గణేష్(21), పెండ్యాల బాలాజీ(21), తిరుమలరావు రవితేజ(21)లు గమనించారు. కార్తిక్‌ను రక్షించేందుకు వెంటనే గోదావరిలో దిగారు. వీరు కూడా ప్రవాహానికి కొట్టుకుపోతుండటంతో వారిని ఒడ్డుకు తెచ్చేందుకు సలాది దుర్గామహేష్, కొమ్మిరెడ్డి చైతన్య నదిలో దిగారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెనక్కి వచ్చేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. వీరితోపాటు వచ్చిన మరో యువకుడు నేదూరు భానుప్రసాద్ జరిగిన ఘటనతో భయాందోళన చెంది అక్కడి నుంచి ఎటో వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు.

## వినాయకునికి వెండి పంచ పాత్ర బహుకరణ



**అమలాపురం,అక్టోబర్ 22, ప్రజాపాలన** : అమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడికి 495 గ్రాములతో పంచపాత్ర, వెండి ఉద్దరిణి ఆదివారం అందజేశారు. ఈమేరకు అమలాపురం పట్టణానికి చెందిన ర్యాలీ బుజ్జి పుణ్యవతి దంపతులు బహుకరించారు. అలాగే వెండిపాదుకులును తటవర్తి సర్వేశ్వరావు నాగపద్మావతి దంపతులు బహుకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్పర్సన్ దూడల విరీతదేవి, ఈఓ దునబోయిన సాయిబాబు, వైస్సార్సీపీ పట్టణ యువత అధ్యక్షులు దూడలఫణి పాల్గొన్నారు.

## మలికిపురంలో ముగిసిన షటిల్ టోర్నమెంట్



**రాజోలు, అక్టోబర్ 22, ప్రజాపాలన** :మలికిపురం మండలం మలికిపురంలో శ్రీరామ బ్యాడ్మింటన్ లీగ్ షటిల్ టోర్నమెంట్ గత రెండు రోజులుగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం విజేతలకు శ్రీరామ బ్యాడ్మింటన్ అధ్యక్షులు దెందుకూరి రాంబాబు రాజు చేతులమీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా రాంబాబు రాజు మాట్లాడుతూ. మలికిపురం ఇండోర్ స్టేడియం ద్వారా ఎంతోమంది క్రీడాకారులను వెలుగులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లి శివకుమార్ తదితరులు

## క్షుద్ర పూజల కలకలం.. నర బలి ఇచ్చారా




**తూర్పు గోదావరి, అక్టోబర్ 22, ప్రజాపాలన** : మండలంలోని వెదురుపాకలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన కంచి వెంకటరమణ (38) పాల వ్యాపారం చేస్తు న్నాడు. శుక్రవారం రాత్రి పాలకేంద్రం వద్ద వ్యాపారం ముగిసిన అనంతరం ఇంటికి చేరుకోలేదు. రాత్రి 9 గంటల తర్వాత కూడా రాకపోవడంతో వెంకట రమణ కు భార్య విజయలక్ష్మి కాల్ చేయగా ఫోన్ కలవలేదని సమాచారం. ఇదిలా ఉండ గా శనివారం ఉదయం వెదురుపాక నుంచి ఆరికరేవుల వెళ్లే దారిలో వెంకట రమణ పంట బోదెలో పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి, ఇంటికి సమాచారం అందించారు. అతడి మృతదేహం కాలువలో పడి ఉండగా, మోటార్ సైకిల్ వంతెనపై ఉంది. అక్కడకు సమీపంలోనే క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండటం స్థానికంగా అలజడి రేపింది. వెంకట రమణ తలపై బలమైన గాయం ఉండటంతో అతడిని ఎవరైనా హత్య చేసి కాలువలో పడవేసి ఉంటారని భావిస్తున్నారు. క్షుద్రపూజల నేపథ్యంలో ఎవరైనా అతడిని హత్య చేశారా? లేక హత్య చేసి, కేసును తప్పుదోవ పట్టించడానికి క్షుద్ర పూజలు చేసినట్లు సృష్టించారా అనేది మిస్టరీగా మారింది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై జి.నరేష్, ఏఎస్సై పి.వెంకటేశ్వరరావులు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ కుమార్ కూడా అక్కడకు చేరుకున్నారు.వెంకట రమణకు ఎవరితోనైనా పాత కక్షలున్నాయా, వివాహేతర సంబంధం వంటి కారణాలు, రాత్రి షాపు మూసేసిన తర్వాత ఎక్కడికి వెళ్లాడు, అతడి వెంట ఎవరున్నారు, ఈ హత్యలో ఎవరి ప్రమేయం ఉండి ఉంటుంది, హత్యకు అసలు కారణాలేమై ఉంటాయనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. వెంకట రమణకు భార్య విజయలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి వరకూ అందరితో మాట్లాడిన అతడు ఉదయానికి విగతజీవిగా పడి ఉండటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తాము ఎలా జీవించాలని కన్నీటిపర్యంతమవుతున్నారు. ఈ సంఘటనపై భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

## మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దాం

**గుంటూరు, అక్టోబర్ 22, ప్రజాపాలన** : 'టిడిపి మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెల్దామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం గుంటూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.



## శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అలరించిన దేవీ నవరాత్రోత్సవాలు



**మచిలీపట్నంఅక్టోబర్ 22, ప్రజాపాలన** : స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు ఎనిమిదవ రోజు ఆదివారం భక్తులను అలరించాయి. శ్రీ పార్వతీ దేవికి, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవికి సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివారికి అభిషేకాలు జరిగాయి. ఉదయం నిర్వహించిన నవదుర్గా పూజలలో ముత్తైదువులు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రి శ్రీ పార్వతీ దేవిని శ్రీ దుర్గా దేవిగా, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవిని శ్రీ ధైర్య లక్ష్మి దేవిగా అలంకరించారు. యెదూరి పావని, జ్ఞాన శ్రీ ప్రదర్శించిన నాట్యంశాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పంచ వాయిద్యాలతో నక్షత్ర హారతి, నీరాజన మంత్ర పుష్పాలు తీర్థప్రసాద వినియోగం జరిగాయి. ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురలీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సామా వెంకట లక్ష్మీ కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఎనిమిదవ రోజు దుర్గాష్టమి సందర్భంగా గర్భగుడిలోని కూరగాయలతో శాకంబరీ అవతారం



**వినుకొండ,అక్టోబర్ 22, ప్రజాపాలన** : బోసు బొమ్మ సెంటర్లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఈరోజు శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవములలో ఎనిమిదవ రోజు దుర్గాష్టమి సందర్భంగా గర్భగుడిలోని కూరగాయలతో శాకంబరీ అవతారం ఉదయం 11 జల కలశములతో నగరంలో ఊరేగింపు, జగద్గురు పీఠం వినుకొండ వారిచే వేద పఠనం, దంపతులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు మరియు కుంకుమ పూజలు,1000 మంది మహిళలతో లక్ష కుంకుమార్చనలు, దంపతులచే మహా చండి హోమములు, అమ్మవారికి శాకంబరీ దేవి అలంకరణ, 108 రకముల ప్రసాదములతో అమ్మవారికి నివేదన జరిగినది. ప్రతిరోజు రాత్రి 8 గంటలకు భరతనాట్యము, కోలాటం , లేజిమ్స్, భక్తి గీతాలాపన వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారికి నవ హారతులు, మంత్రపుష్పము తీర్థప్రసాద వినియోగము వంటి కార్యక్రమాలు జరుగుతున్నవి. కావున వినుకొండ పట్టణంలోని ఆర్యవైశ్యులు, అమ్మవారి భక్తులు ప్రజలు అందరూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించి తీర్ధ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము. ఈ కార్యక్రమములలో పట్టణ ఆర్యవైశ్య సంఘ పాలకమండలి సభ్యులు మిత్తింటి కృష్ణాంజనేయులు, నేరెళ్ల వెంకట పాపారావు, పెనుగొండ రమేష్, పెండేల శ్రీనివాసరావు, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, కోట వెంకట ప్రకాష్ బాబు, ఇతర ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆర్యవైశ్య ప్రముఖులు అమ్మవారి భక్తులు వేలాదిగా పాల్గొనినారు.

# అధికారం అడ్డుపెట్టుకొని ఓటర్లని భయపెట్టడం ఘోరం.

### మీడియా సమావేశం లో పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయ

**వినుకొండ,అక్టోబర్ 22, ప్రజాపాలన** : పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశం లో పాల్గొని మాట్లాడుతూ వినుకొండ లో ఎమ్మెల్యే బొల్లా అరాచకాలు మరి ఎక్కువ అయ్యాయని ఈ మధ్య పలుమార్లు బొల్లా తెలుగు దేశం పార్టీ కి ఓటు ఎల్లా వేస్తారని అలా ఓటు వేయాలంటే బ్రహ్మనాయుడుని దాటుకొని వెళ్లాలని ప్రజలను బెదిరిస్తున్నాడని ఎన్నికల కమిషన్ అంటే అంత లెక్కలేనితనంతో ఉన్నాడని అసలు మనం భారత ప్రజాస్వామ్యం అంటే రాజ్యాంగం అంటే ఏమనుకుంటున్నావు అని.బ్రహ్మనాయుడుని దాటుకొని వెళతాం కాదు జనం తొక్కుకుంటూ వెళతారో గుర్తుపెట్టుకో బొల్లా .మీ సైకో పాలనకి మీ అరాచకాలకి మీ ఆకృత్యాలకి రోజులు దగ్గరపడ్డాయని ఈ సందర్భముగా హెచ్చరించారు.నేను సిద్ధంగానే ఉన్నా మీ వైకాపాను తుడిచిపెట్టడానికి ప్రజలు కూడా ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు.జనం ఓట్లు వేయాలంటే బ్రహ్మనాయుడుని దాటుకొని వెళ్లాలని ఒక వీధి గుండా లాగా ఒక రౌడీ లాగా మాట్లాడుతుంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది ఈ విధంగా అయితే ఎన్నికలు శాంతియుతంగా ఎట్లా నిర్వహిస్తారు.బొల్లా వ్యాఖ్యలపై తక్షణమే ఎన్నికల కమిషన్ స్పందించాలా సుమోటోగా కేసు నమోదు చేయాలి.బ్రహ్మనాయుడు వ్యాఖ్యల మీద మేము న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం.ఓట్లు తీసేయాలని అధికారులు బెదిరించడం ఓటు వేయకపోతే ఊరుకోనని ప్రజలను హెచ్చరించడం అవినీతిని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం బొల్లా బ్రహ్మనాయుడు అలవాటుగా మారిందన్నారు.ఆయన అరాచకాలను ఎదుర్కోవడానికి తెలుగుదేశం , జనసేన సైనికులు సిద్ధంగా ఉన్నారు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ వారికి సంఘీబావం గా శ్రీకాకుళం నుండి కుప్పం వరకు సైకిల్ యాత్ర చేపట్టిన టిడిపి కార్యకర్తలు పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులు దౌర్జన్యంగా చొక్కాలు విప్పి ,దుర్భాసలాడి నారు వారు చేసిన తప్పుదు ఏంటి వారు కి ఇష్టం అయిన దుస్తులు వారి దరించ వద్దు అని చెప్పే హక్కు మీకు ఎవరు ఇచ్చారు సైకిల్ యాత్ర వెళ్తే మీకు ఏంటి పెద్దిరెడ్డి రామ చంద్రరెడ్డి దుర్మార్గాలు అలాగే రాష్ట్రము లో రోజురోజుకి దుర్మార్గాలు ఎక్కువ అయ్యాయని ఈ సందర్భముగా అన్నారు. కారంపూడికి దగ్గర రామాంజిని అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సదుపాయాలు సరిగా లేవని గురజాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సూచించారు గురజాల ఆస్పత్రికి వెళ్లారు.వైద్య సదుపాయాలు సరిగా లేవని నరసారావు పేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని వైద్యులు సిఫార్సు చేశారు కాని బైకుపై ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకుని తిరిగొస్తూ మార్గమధ్యంలో జూలకల్లు వద్ద రహదారిపై ఉన్న పెద్ద గుంతలో పడి తీవ్రంగా గాయపడి చనిపోవడం ఇది చాల బాధకరమని సాధారణ కాన్పు కూడా చేయలేని దయనీయ స్థితిలో కారంపూడి, గురజాల ఆస్పత్రులు ఉండటం దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పీహెచ్ సెంటర్లో ఆడబిడ్డకి డెలివరీ కూడా చేయలేనటువంటి ఆసుపత్రిలో వసతులు లేకుండా ఆరోగ్య శాఖామంత్రి ప్రభుత్వ విప్పు పిన్నెల్లి రామ కృష్ణ రెడ్డీ జరిగిన ఘటనలు ఏమి సమాధానం చెబుతుందని అన్నారు.ప్రభుత్వపైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరియు మంత్రి రజిని దీనికి బాధ్యులుగా తన పదవులకు రాజీనామా చేయాలని,దోచుకోవటం దాచుకోవడం అవినీతి సొమ్ముతో తెలంగాణ మద్యాన్ని తీసుకొచ్చి అమ్ముకోవడం తప్ప దుర్మార్గాలు



చేయడం తప్పుడు కేసులు పెట్టి వేధించటం, బీసీల మీద ఎస్సీల మీద ఎస్టీల మీద దాడులు చేసి బెదిరించి కేసులు పెట్టడం తప్ప పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసింది ఏమి లేదు అని అన్నారు.రాష్ట్రంలో రహదారులు సరిగా లేక ప్రతిరోజు ఎన్నో ప్రాణాలు పోతున్నాయని వీటన్నిటికీ జగన్మోహన్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని అన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవంకి నివాళులర్పించడానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ సభ మర్యాదను మర్చిపోయి నోటికొచ్చినట్టు ప్రతి దాన్ని రాజకీయంగా మాట్లాడటం సిగ్గుచేటని. వాస్తవాలు రాసి నిజాలు చూపించేటువంటి జర్నలిస్టులని సంఘవిద్రోహులుగా లెక్క కట్టడం దుర్మార్గమని,అవినీతి అక్రమాలు చేసేటువంటి ఈ ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యేలకి దుర్మార్గాలను ఎండగట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ప్రజలందరూ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ఎల్లగొట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్లో ప్రజాస్వామ్యం లేదని అంబేద్కర్ గారి రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారన్నారు అని ఈ సందర్భంగా అన్నారు. ఈ మీడియా సమావేశం లో రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు ,టిడిపి నాయకులు వంకయలపాటిపాటి పేరయ్య, హనుమా నాయక్, కర్నాటి వెంకటరెడ్డి,బత్తుల గోవిందరాజులు పాల్గొన్నారు.

## పాపాయిపాలెం కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

– ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల కోలాట ప్రదర్శన



**వేటపాలెం,అక్టోబర్ 22, ప్రజాపాలన** : చీరాల నియోజకవర్గ పరిధిలోని, వేటపాలెం మండ లం, పాపాయిపాలెంలోని, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న దసరా నవరాత్రి మహోత్సవ వేడుకలలో భాగం గా, శ్రీ కనకదుర్గమ్మ భజన మండలి వారిచే, అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతిరోజు అమ్మవా రిని వేరువేరు అలంకారాలలో విశేషంగా అలం కరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దసరా మహోత్సవ వేడుకలలో, భక్తులు వేలాదిగా అమ్మవారిని దర్శించు కున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు పొంది, అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి టెంపుల్ నిర్వాహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మైత్రీ మెడికల్ క్యాంపు కు విశేష ఆదరణ




**మచిలీపట్నం అక్టోబర్ 22, ప్రజాపాలన** : స్థానిక నవీన్ మిట్టల్ కాలనీలో జరిగిన మెగా వైద్య శిబిరంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పది రూపాయల డాక్టర్ గా ప్రసిద్ధిగాంచిన డాక్టర్ నూరి పర్వీన్ సుమారు 350 పైగా ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగింది. జిల్లా రవాణా అధికారి పి. సీతాపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా. డి ఆశా లత గౌరవ అతిథిగా పాల్గొనడం జరిగింది. ప్రత్యేక అతిధులుగా గూడవల్లి నాగరాజు పాల్గొన్నారు. ఉదయం10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అనేక మంది ప్రజలు దూర ప్రాంతాల నుండి కూడా వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు మైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఎఆర్కె వర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిధులు అందరూ కూడా మైత్రీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం డా. నూరి పర్వీన్ మాట్లాడుతూ మైత్రీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు తనను విశేషంగా ఆకట్టుకున్నాయని ఇక పై కూడా తన సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తోట సత్యనారాయణ డా అబ్దుల్ ఖాజా, జెసిఐ ప్రెసిడెంట్ కృష్ణ భాస్కర్, మరియు మైత్రీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మాచవరం సహజయోగ ధ్యాన మందిరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు



**మచిలీపట్నం అక్టోబర్ 22, ప్రజాపాలన** : మచిలీపట్నం మాచవరం మార్కెట్ యార్డ్ పక్క రోడ్డులో గల సహజ యోగ ధ్యాన మందిరంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సహజ యాగ ప్రదాత పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవిని ఆదివారం ఎనిమిదవ రోజున దుర్గ దేవి గా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజ జరిగింది. ఈ నిర్వహణలో ఉచిత సహజ యోగ ట్రస్ట్ కృష్ణ జిల్లా కోఆర్డినేటర్ పంతం వెంకట గజేంద్రరావు, పట్టణ కోఆర్డినేటర్ కొల్లిపర నాగలక్ష్మి మరియు పడమటి రామ్మోహన్రావు, మరకాని దుర్గ, మోటమర్రి ప్రేమనాథ్ తదితరులు నిర్వాహకులుగా పనిచేస్తున్నారు.


















## పాపాయిపాలెం కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

– ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల కోలాట ప్రదర్శన



**వేటపాలెం, అక్టోబర్ 22, ప్రజాపాలన** : చీరాల నియోజకవర్గ పరిధిలోని, వేటపాలెం మండ లం, పాపాయిపాలెంలోని, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న దసరా నవరాత్రి మహోత్సవ వేడుకలలో భాగం గా, శ్రీ కనకదుర్గమ్మ భజన మండలి వారిచే, అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతిరోజు అమ్మవా రిని వేరువేరు అలంకారాలలో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దసరా మహోత్సవవేడుకలలో, భక్తులు వేలాది గా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు పొంది, అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి టెంపుల్ నిర్వాహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.






# నాని కోసం పది కోట్ల విలన్




నేచురల్ స్టార్ నాని, వివేక్ ఆత్రేయ అనగానే.. 'అంటే సుందరానికి' తరహాలోనే ఒక క్లాస్ లవ్ స్టోరీ వస్తుందని అంచనా వేస్తారు ప్రేక్షకులు. వివేక్ మొదటి సినిమా 'మెంటల్ మదిలో' కూడా క్లాస్‌గా సాగిపోయే లవ్ స్టోరీనే. రెండో చిత్రం 'దోచేవారెవరురా' క్రైమ్ కామెడీ కథాంశంతో తెరకెక్కింది. ఇక 'అంటే సుందరానికి' సంగతి తెలిసిందే. కానీ ఈసారి వాళ్లిద్దరూ పూర్తిగా రూటు మార్చేస్తున్నారు. వీరి కలయికలో రాబోయే కొత్త చిత్రం ఒక ఫుల్ లెంగ్త్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుందట. వీళ్ల కాంబినేషన్ నుంచి ఇలాంటి సినిమా వస్తుందని ఊహించని విధంగా ఈ చిత్రం ఉంటుందని టీం సమాచారం. ఈ సినిమా కోసం ఎంచుకున్న విలన్ ఎవరో చూస్తే.. వాళ్లు అంచనాలకు భిన్నంగా సాగిపోనున్నారని అర్థమవుతుంది. తమిళంలో ప్రస్తుతం తిరుగులేని క్రేజ్, డిమాండ్ తెచ్చుకున్న ఎస్.జె.సూర్య నాని-వివేక్ సినిమాలో విలన్ పాత్ర చేస్తుండటం విశేషం. విజయ్, మహేష్ బాబు సహా చాలామంది పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలతో అదరగొట్టాడు సూర్య. ఇటీవలే విశాల్ సినిమా 'మార్క్ ఆంటోనీ'లో విలనీతో పాటు కామెడీ కూడా అదరగొట్టేశాడు. ఆ సినిమా తమిళంలో వంద కోట్ల వసూళ్లు సాధించిందంటే అందులో సూర్య పాత్ర ఎంతో కీలకం. సూర్య డిమాండ్ ఏ స్థాయిలో ఉందంటే విలన్ పాత్ర చేయడానికి అతను రూ.10 కోట్ల దాకా డిమాండ్ చేస్తున్నాడట. ఈ పారితోషకం సంగతి తెలిసి చాలామంది వామ్మో అనుకుంటున్నారు. కానీ డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ మాత్రం పట్టుబట్టి అతను కోరిన పారితోషకం ఇచ్చి నాని-వివేక్ సినిమాలో విలన్ పాత్రకు ఒప్పించారు. ఈ రోజే ఈ సినిమా గురించి అనౌన్స్‌మెంట్ రాగా.. దీంతో పాటే ఎస్.జె.సూర్య ఇందులో నటించనున్న సమాచారం కూడా అధికారికంగా బయటికి వచ్చింది. ఇంకా హీరోయిన్ సంగతి తేలలేదు. నాని కెరీర్లో 'దసరా' తర్వాత అత్యధిక బడ్జెట్లో తెరకెక్కనున్న సినిమా ఇదే.

# తమన్ వల్లే మైలేజ్ తగ్గిందా



ఎంత పెద్ద స్టార్ హీరో సినిమా అయినా సరే సంగీతం ఇప్పుడెంత కీలక పాత్ర పోషిస్తుందో చెప్పనక్కర్లేదు. అల వైకుంఠపురములో, పుష్ప లాంటి భారీ చిత్రాలైనా, డీజే టిల్లు లాంటి బడ్జెట్ మూవీ అయినా బజ్ తీసుకురావడంలో మ్యూజిక్ ప్రభావం అంతా ఇంతా కాదు. దసరా బరిలో విజేతగా దూసుకుపోతున్న భగవంత్ కేసరి వసూళ్ల పరంగా స్ట్రాంగ్ గా ఉన్నప్పటికీ రిపీట్ ఆడియన్స్ ని రప్పించడంలో ఒక్క అంశం స్పీడ్ బ్రేక్ లా నిలిచింది. అదే తమన్ పాటలు. గణేష్ యాంతం పేరుతో వదిలిన ఫస్ట్ ఆడియో సింగల్ కనీసం వినాయక చవితి మంటపాల్లో కూడా పెద్దగా వినిపించలేదు. బాలయ్య, శ్రీలీల ఎంత హుషారుగా నర్తించినా వాళ్ళ జోష్ కు తగ్గ ట్యూన్ పడలేదు. కూలి నెంబర్ 1, జై చిరంజీవా రేంజ్ లో ఒక ఐకానిక్ గణేశుడి పాట ఉండాల్సింది. ఎమోషన్ ప్లస్ సెంటిమెంట్ కలగలిసిన ఉయ్యాలో ఉయ్యాలో స్క్రీన్ మీద చూసేందుకు బాగుంది కానీ ఆడియో పరంగా రిపీట్ వేల్యూ లేదని మ్యూజిక్ లవర్స్ అభిప్రాయం. ఇలాంటి కథకు డ్యూయెట్లు, ఐటెం సాంగ్స్ అవసరం లేదు. సందర్భానికి తగ్గట్టు మళ్ళీ వినేలా పాడుకునేలా కుదిరితే చాలు. రోర్ అఫ్ కేసరి బాగుంది కానీ అఖండ, లెజెండ్ రేంజ్ లో లేదనే అభిప్రాయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. మిగిలిన మరో రీమిక్స్ పాటని జోడించే సూచనలు తగ్గిపోతున్నాయి. దాదాపు లేనట్టేనని ఇన్ సైడ్ టాక్. ఫ్లోకు అడ్డం వస్తుంది కాబట్టి ఎంత బాగా షూట్ చేసినా యాడ్ చేయకూడదని నిర్ణయించుకున్నారట. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు తమన్ నిరాశ పరచలేదు. ఇదే ప్రధానంగా ఊరట కలిగించే అంశం. ఇదంతా ప్రత్యేకంగా ప్రస్తావించాడనికి కారణం జనం మళ్ళీ మళ్ళీ థియేటర్లకు వచ్చేలా చేసేవి మాస్ ఎలిమెంట్స్, పాటలు. మొదటి దాంట్లో కేసరి తనవంతు పాత్ర పోషించగా రెండోది మాత్రం తమన్ స్థాయి అవుట్ ఫుట్ ఇవ్వలేకపోయింది. లేకపోతే మైలేజ్ ఇంకా ఎక్కువ వచ్చేదన్న మాట వాస్తవం.

# లోకేష్ నేర్వాల్సిన పాఠం





'ఖైదీ', 'విక్రమ్' సినిమాలతో లోకేష్ కనకరాజ్‌కు వచ్చిన క్రేజ్ అంతా ఇంతా కాదు. దేశంలో రాజమౌళి తర్వాత దర్శకుడిగా ఎక్కువ క్రేజ్ దక్కించుకున్నది లోకేషే అంటే అతిశయోక్తి కాదు. కేవలం అతడి పేరు చూసే ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. తన కొత్త సినిమా 'లియో' దసరా సీజన్లో రెండు పెద్ద తెలుగు సినిమాలతో పోటీ పడుతూ వాటిని మంచి క్రేజ్ సంపాదించుకుందంటే అందుకు కారణం హీరో విజయ్ కాదు, దర్శకుడు లోకేష్ కనకరాజే. ఈ మధ్య కాలంలో తెలుగు ప్రేక్షకులు ఇంత క్యూరియాసిటీ ఏ సినిమా విషయంలోనూ చూపించలేదు. కానీ ఎన్నో అంచనాలతో థియేటర్లకు వెళ్లిన ఆడియన్స్‌కు నిరాశ తప్పలేదు. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆడియన్స్.. ఈ విషయంలో బాగా నిరాశ పడ్డారు. ఏదో మొక్కుబడిగా ఎల్‌సీయూతో కనెక్షన్ కలిపాడే కానీ.. అందులో ఒరిజినాలిటీ కనిపించలేదు. 'లియో'లో అసలు విషయం లేదా అంటే అదేమీ కాదు. ఒక ఎగ్జైటింగ్ యాక్షన్ ఎంటర్టైనర్ తీయడానికి తగ్గ సెటప్ కుదిరినా.. కథనంలో ఉత్కంఠ రేపే విషయాలు లేకపోవడం.. కేవలం పార్తిబన్ లియోనా కాదా అనే విషయం మీదే ఆరంభం నుంచి చివరి వరకు కథ నడవడం ప్రతికూలంగా మా రింది. కథలో వేరే డైమన్షనే కనిపించ కపోవడంతో ప్రేక్షకు లకు విసుగు పుట్టింది. లోకేష్ ఏదో హడావు డిగా, మొక్కుబడిగా ఈ కథను లాగించేసినట్లు అనిపించిందే తప్ప ఇంటెన్సిటీ లేకపోయింది. ఏ పాత్ర కూడా ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. సంజయ్ దత్, అర్జున్ లాంటి నటులను పూర్తిగా వేస్ట్ చేసేశాడు లోకేష్. అతను ఇంకొంచెం టైం తీసుకుని ఈ పాత్రలను.. సినిమాలోని కీలక ఘట్టాలను ఇంకొంచెం ఎఫెక్టివ్‌గా రాసుకుని, వాటికి తన మార్కు టేకింగ్ జోడించి ఉంటే సినిమా వేరే లెవెల్లో ఉండేది. ఇంత నెగెటివ్ టాక్‌లోనూ 'లియో' బాగానే ఆడుతుండటం లోకేష్ పట్ల ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు నిదర్శనం. సినిమా ఓ మోస్తరుగా ఉన్నా సినిమా రేంజే వేరుగా ఉండేది. ఇక ఖైదీ, విక్రమ్‌ల మాదిరి సినిమా పకడ్బందీగా ఉండి ఉంటే ఈ సినిమాకు ఆకాశమే హద్దు అయ్యేది. 'విక్రమ్' తీశాక ఏడాది వ్యవధిలోనే సినిమా తీసేసి రిలీజ్ చేసేయాలని టార్గెట్ పెట్టుకోవడం మైనస్ అయినట్లు కనిపిస్తోంది. ఈసారైన లోకేష్ హడావుడి పడకుండా.. రజినీ సినిమా మీద ఎక్కువ సమయం, శ్రద్ధ పెట్టి తీస్తే తన నుంచి మళ్లీ ఓ బ్లాక్‌బస్టర్ రావచ్చు.





















## భారత్ చర్యతో లక్షల మంది జీవితాలు దుర్భరం: ట్రూడో

**ఒట్టావా, అక్టోబర్ 22, ప్రజాపాలన** : కెనడా దౌత్యవేత్తలకు రక్షణ కల్పించడాన్ని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. 41 మంది కెనడా దౌత్యవేత్తలపై భారత్ అనుసరించిన వైఖరి ఈ రెండు దేశాల్లోని లక్షలాది మంది జీవితాల్ని దుర్భరం చేస్తున్నదని ట్రూడో ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ నుంచి కెనడాకు చెందిన 41 మంది దౌత్యవేత్తలను వెనక్కి పంపిస్తున్నన్నట్టు భారత్ ప్రకటించిన నేపథ్యం లో జస్టిన్ ట్రూడో వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. కెనడా దౌత్యవేత్తల అధికారిక హోదాను ఏకపక్షంగా రద్దు చేస్తామని భారత ప్రభుత్వం బెదిరించిందని ఆయన ఆరోపించారు. భారత్ చర్య కారణంగా కెనడా, భారతదేశంలో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలు సాధారణ జీవితాన్ని భారత ప్రభుత్వం కష్టతరం చేసిందని ట్రూడో పేర్కొన్నారు. ఇది దౌత్య విధానంలోని ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించడమేనని అన్నారు. భారత్‌లో ఉంటున్న కెనడియన్ల సంక్షేమంపై తనలో ఆందోళన నెలకొన్నదన్నారు. కాగా, కెనడా ఆరోపణలపై భారత ప్రభుత్వం స్పందించింది. భారతదేశంలోని కెనడియన్ దౌత్యవేత్తలకు సంబంధించి కెనడా ప్రభుత్వం అక్టోబర్ 19న చేసిన ప్రకటనను గమనించామని, ఇరు దేశాల్లోని దౌత్యవేత్తల సంఖ్యలో సమానత్వం గురించి చర్చించామని పేర్కొంది. భారతదేశంలో కెనడా దౌత్యవేత్తల సంఖ్య అధికంగా ఉందని, అందుకే భారతదేశ అంతర్గత వ్యవహారాల్లోనూ కెనడా జోక్యం పెరిగిపోయిందని భారత ప్రభుత్వం ఆరోపించింది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com